



26 గేట్ల ద్వారా సాగర్ నీటి విడుదల

● ఎగువ నుంచి 3,48,235 క్యూసెక్కుల వరద రాక

7

చేనేతను ప్రోత్సహించాలి

● యాదాద్రిజిల్లాలో ప్రపంచస్థాయి ప్రముఖులు ఉండటం గర్వకారణం ● గవర్నర్ జిష్ణుదేవ్‌వర్మ



కలెక్టరేట్‌లో చర్చాగోష్ఠిలో పాల్గొన్న గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ

యాదాద్రి, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి): చేనేత వస్త్రా లను, ఆ కళను కాపాడుతున్న కార్మికులను ప్రోత్సహించాలని గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ అన్నారు. గురువారం యాదాద్రిభువనగిరి జిల్లా కలెక్టరేట్‌లో జిల్లాకు చెందిన వివిధ రంగాల ప్రముఖులు, జిల్లా అధికారులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రపంచస్థాయి ఆధ్యాత్మిక ఆలయాలతో పాటు వివిధరంగాల్లో రాష్ట్రంలో ప్రముఖంగా అవార్డులు పొందిన జిల్లాగా యాదాద్రిభువనగిరి వెలుగొందుతుందని కొనియాడారు. వివిధరంగాల్లో జిల్లా వాసులు అవార్డులు పొందడం అభినందనీయమన్నారు. ఉపాధిహామీ పథకం కింద రాష్ట్రంలోనే అత్యధికంగా కూలీలకు పని కల్పించడం గర్వించదగ్గ విషయమన్నారు. చేనేత సంస్కృతి చాలా గొప్పదని, అంతర్జాతీయ స్థాయిలో పోటీపడే కళాకారులు జిల్లాలో ఉండటం గర్వకారణమని వారి సేవలను కొనియాడారు.

ప్రముఖులకు గవర్నర్ సన్మానం...

స్వాతంత్ర్య సమరయోధులు మన్నె గోపాల్‌రెడ్డి, పద్మశ్రీ అవార్డు గ్రహీతలు కూరెళ్ల విఠలాచర్య, కేతావత్ సోమ్లానాయక్‌లను గవర్నర్ వారి వద్దకు వచ్చి శాలువాతో సత్కరించారు. వివిధ రంగాల్లో ప్రసిద్ధులైన జిల్లాకు అవార్డు గ్రహీతలను అభినందించారు. వారు కృషి రంగాల్లో సాధించిన ఫలితాలను గవర్నర్ ప్రత్యేకం అడిగి తెలుసుకున్నారు. కలెక్టర్ హనుమంతు కే.జెండగే జిల్లాలో వివిధ శాఖల ద్వారా అమలవుతోన్న అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలపై పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా గవర్నర్‌కు వివరించారు. జిల్లాకు విచ్చేసిన గవర్నర్‌కు ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్య, భువనగిరి ఎమ్మెల్యే కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి, కలెక్టర్ హనుమంతు జెండగే, అదనపు కలెక్టర్లు బెన్ షాలోమ్, గంగాధర్, డీసీపీ రాజేశ్‌చంద్ర స్వాగతం పలికారు.

గవర్నర్‌తో చర్చా గోష్ఠిలో పాల్గొన్న వారిలో..

కలెక్టరేట్‌లో గవర్నర్ చర్చా గోష్ఠిలో పాల్గొన్నారు. పద్మశ్రీ అవార్డు గ్రహీతలు గజం గోవర్దన్, గజం అంజయ్య, చింతకింది మల్లేశం, డాక్టర్ కూరెళ్ల విఠలాచార్య, కేతావత్ సోమ్లానాయక్, సంత్ కబీర్ అవార్డు గ్రహీత జెల్లా వెంకటేశం, కేంద్రసాహిత్య అకాడమీ గ్రహీత ఆచార్య ఎస్.గోపి, భువనగిరి కేంద్ర సాహిత్య యువ పురస్కార గ్రహీత డాక్టర్ గడ్డం మోహన్‌రావు, రాష్ట్ర ప్రభుత్వ యువ పురస్కార గ్రహీత తిరునగరి శ్రీనివాస్, కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు గ్రహీత నిఖిలేశ్వర్, రాష్ట్ర ప్రభుత్వ కాళోజీ పురస్కార్ గ్రహీత రామోజు హరగోపాల్, పర్వతారోహకురాలు పడమటి అన్వితారెడ్డి, భువనగిరి స్వతంత్ర సమర యోధులు మన్నె గోపాల్‌రెడ్డి, నంది అవార్డు గ్రహీత ఎండీ అబ్దుల్, జాతీయ ఉత్తమ సినీగేయ రచయిత డాక్టర్ సుద్దాల అశోక్‌తేజ, రాష్ట్ర ప్రభుత్వ విశిష్ట పురస్కార గ్రహీతలు అభినయ శ్రీనివాస్, కదారి శ్రీనివాస్, కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు గ్రహీత డాక్టర్ దేవరాజు మహారాజు, శరత్‌చంద్ర, ఛటోపాధ్యాయ జాతీయ పురస్కార గ్రహీత డాక్టర్ షేక్ అబ్దుల్ ఘని, కొండా లక్ష్మణ్‌బాపూజీ అవార్డు గ్రహీత డాక్టర్ ఏనుగు నర్సింహారెడ్డి, తెలుగు విశ్వవిద్యాలయం పురస్కార గ్రహీత లింగంపల్లి రామచంద్ర ఉన్నారు.

ఆలయాల్లో గవర్నర్ ప్రత్యేక పూజలు...

గవర్నర్ ఆలేరు మండలం కొలనుపాకలోని జైనమందిరాన్ని, సోమేశ్వరాలయం, భువనగిరిలోని స్వర్ణగిరిలోని వెంకటేశ్వరుని ఆలయాలను దర్శించుకుని, ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు.



ఆలేరు మండలం కొలనుపాకలో సోమేశ్వరాలయంలో పూజల్లో పాల్గొన్న గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ



పైసలిస్తేనే మరమ్మతులు

ఒక్కో ట్రాన్స్‌ఫార్మర్‌కు కనీసం రూ.7వేలు డిమాండ్ ● ముడుపులివ్వకపోతే ముందుకుసాగని వైనం

నల్లగొండ, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): ట్రాన్స్‌ఫార్మర్ మరమ్మతులకు గురైందంటే రైతులకు చుక్కలు కనబడుతున్నాయి. ఓ వైపు విద్యుత్ లేక పంటలు ఎండే పరిస్థితి, మరోవైపు ట్రాన్స్‌ఫార్మర్ మరమ్మతుకు అడుగడుగునా ముడుపులు ముట్టచెబితేగానీ పనులు ముందుకు సాగని దుస్థితితో రైతులు అగచాట్లుపడుతున్నారు. వానాకాలంలో పంటల సాగు కారణంగా విద్యుత్ వినియోగం పెరగడం, తక్కువ సామర్థ్యం ఉన్న ట్రాన్స్‌ఫార్మర్లపై లోడ్ ఎక్కువగా పడడం, సుదీర్ఘకాలంగా ఉన్న కండక్టర్లతో ట్రాన్స్‌ఫార్మర్లు మరమ్మతుకు గురవుతున్నాయి. ట్రాన్స్‌ఫార్మర్లు మరమ్మతులకు గురైతే నిబంధనల ప్రకారం విద్యుత్‌సంస్థనే మరమ్మతు చేసి మళ్లీ అమర్చాలి. అలాంటి పరిస్థితి క్షేత్రస్థాయిలో కొరవడింది. సిబ్బందికి, ఉద్యోగులకు ముడుపులు ముట్టచెబితేనే సకాలంలో ట్రాన్స్‌ఫార్మర్లు మరమ్మతులు చేసి ఇస్తున్నారని, లేదంటే కాలయాపన చేస్తూ ఇబ్బంది పెడుతున్నారని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వ్యవసాయ ట్రాన్స్‌ఫార్మర్లు కాలిపోతే కనీసం రూ.7వేలకు ముడినట్లేనని రైతులు ఆవేదన చెందుతున్నారు.

మరమ్మతులకు గురవుతున్న ట్రాన్స్‌ఫార్మర్లు

వానాకాలం సీజన్ కావడం, ప్రధానంగా వ్యవసాయానికి విద్యుత్ వినియోగం పెరగడం, ట్రాన్స్‌ఫార్మర్లపై సామర్థ్యానికి మించి లోడ్ వేస్తుండడం వంటి కారణాలతో అవి కాలిపోతున్నాయి. జిల్లాలోని 11 మరమ్మతు కేంద్రాలకు రోజూ కనీసం 50వరకు ట్రాన్స్‌ఫార్మర్లు మరమ్మతుల నిమిత్తం వస్తున్నాయి. ప్రతీ కేంద్రానికి విద్యుత్ సంస్థ వాహనం ద్వారానే ట్రాన్స్‌ఫార్మర్లను తీసుకువచ్చి మరమ్మతులు చేసి మళ్లీ ఏర్పాటుచేసేంతవరకు సిబ్బందిదే బాధ్యత. అయితే జిల్లాలో మాత్రం రైతులే అన్నింటినీ భరిస్తున్నారు. ఒక్కో ట్రాన్స్‌ఫార్మర్ కాలిపోతే రవాణా చార్జీలు సహా కనీసం రూ.7వేల నుంచి రూ.10వేల వరకు ఖర్చు వస్తోంది. ఇదంతా ముడుపుల రూపంలోనే ఇవ్వాల్సి వస్తోందని రైతులు వాపోతున్నారు.

మా దృష్టికి తీసుకువస్తే చర్యలు

ట్రాన్స్‌ఫార్మర్ల మరమ్మతులకు ఎవ్వరూ డబ్బులివ్వవద్దు. ఎవరైనా డిమాండ్‌చేస్తే మా దృష్టికి తీసుకురావాలి. మరమ్మతుల్లో జాప్యం జరగదు. నిర్ణీత సమయం మేరకు మరమ్మతులు జరుగుతాయి. లంచాల కోసం ఎవరు డిమాండ్ చేసినా, వెంటనే మాకు తెలియజేస్తే చర్యలు తీసుకుంటాం.

సీహెచ్.పాల్‌రాజ్, ఎస్ఈ,
టీజీఎస్‌పీడీసీఎల్ నల్లగొండ సర్కిల్

ముడుపులు ముడితేనే పని

ట్రాన్స్‌ఫార్మర్లు కాలిపోతే విద్యుత్ సంస్థ (టీజీఎస్‌పీడీసీఎల్) ఉద్యోగులే దాన్ని గుర్తించి, సంస్థ వాహనంలోనే మరమ్మతు కేంద్రానికి తీసుకువచ్చి మరమ్మతులు చేసి తిరిగి దాన్ని సంబంధిత స్థానంలో అమర్చాలి. ఒకటి, రెండు రోజుల్లో పూర్తి పారదర్శకంగా ఈ ప్రక్రియ కొనసాగాల్సి ఉంటుంది. అయితే నల్లగొండ జిల్లాలో మాత్రం ఈ పరిస్థితి లేదు. ట్రాన్స్‌ఫార్మర్ కాలిందంటే రైతులు అవస్థలు ఎదుర్కొంటున్నారు. క్షేత్రస్థాయిలో దాన్ని ఫీడర్ నుంచి డిస్‌కనెక్ట్ చేయడం, మరమ్మతును సూచిస్తూ సంబంధిత సబ్‌డివిజనల్ కార్యాలయం నుంచి ఇచ్చే టీనోట్ జారీ మొదలు, లోడింగ్ అన్‌లోడింగ్, రవాణా ఖర్చులు, తిరిగి ట్రాన్స్‌ఫార్మర్ ఫిట్టింగ్ వరకు అన్ని ఖర్చులు రైతులే భరిస్తున్నారు. టీనోట్ జారీ, రవాణా, అన్‌లోడింగ్ ఖర్చులను విద్యుత్ సంస్థ భరించాల్సి ఉండగా, ఎక్కడా అలా జరగడం లేదు. ఆయా పనులకు పక్కాగా డిమాండ్ చేసి మరీ ముడుపులు తీసుకుంటున్నారు. మరమ్మతు కేంద్రంలోనూ మరమ్మతులు ఉచితంగానే చేసి రైతులకు ట్రాన్స్‌ఫార్మర్లు అప్పగించాలి. ఇక్కడ ఒక్కో ట్రాన్స్‌ఫార్మర్‌కు కనీసం రూ.5వేలనుంచి రూ.10వేల వరకు డిమాండ్ చేసి తీసుకుంటున్నారని, గత్యంతరం లేని స్థితిలో ఇస్తున్నామని మరీ పని చేయించుకుంటున్నామని రైతులు వాపోతున్నారు. ముడుపులివ్వకపోతే వారం, పదిరోజుల వరకు కాలయాపన చేస్తూ మరమ్మతులు చేయకుండా ఇబ్బందులకు గురిచేస్తున్నారు. విద్యుత్ లేక పంటలు ఎండితే నష్టం వాటిల్లుతుండడంతో ముడుపులు ఇవ్వక తప్పడం లేదని రైతులు చెబుతున్నారు. ఇటీవల కనగల్ మండలం ఓ గ్రామానికి చెందిన వ్యవసాయ ట్రాన్స్‌ఫార్మర్ నాలుగు నెలల క్రితమే కాలిపోగా దాన్ని మరమ్మతు చేయించారు. మళ్లీ నాలుగు రోజుల క్రితం కాలిపోగా, దాన్ని మరమ్మతుకు సదరు రైతులు టీనోట్ కోసం ఏడీఈ కార్యాలయానికి వెళ్లగా, డబ్బులివ్వకపోతే టీనోట్ ఇచ్చేది లేదని తేల్చిచెప్పారు. దీంతో వెంటనే మరమ్మతు చేయాలంటే రూ.5వేలు ఇవ్వాలని డిమాండ్ చేశారని సదరు రైతు 'ఆంధ్రజ్యోతి'కి తెలిపాడు. అదేవిధంగా తిప్పర్తి మండలంలోని ఓ గ్రామానికి చెందిన రైతులకు ఇదే పరిస్థితి ఎదురైంది.

ఎడ్యుకేషన్ హబ్‌గా మారుస్తా

- సెప్టెంబరు 12న మెడికల్ కళాశాలను ప్రారంభిస్తాం
- బొట్టుగూడ ప్రభుత్వ పాఠశాలను రాష్ట్రంలోనే ఆదర్శ పాఠశాలగా తీర్చిదిద్దుతా
- మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి



బొట్టుగూడ పాఠశాలకు శంకుస్థాపన చేస్తున్న మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి

నల్లగొండ టౌన్, ఆగస్టు 29: నల్లగొండను ఎడ్యుకేషన్ హబ్‌గా మార్చడమే తన లక్ష్యమని రోడ్లు, భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి అన్నారు. గురువారం జిల్లా కేంద్రంలోని బొట్టుగూడలో రూ.3కోట్ల వ్యయంతో నిర్మించనున్న కోమటిరెడ్డి ప్రతీక్ మెమోరియల్ ప్రభుత్వ పాఠశాల నూతన భవనానికి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో మంత్రి మాట్లాడుతూ సమాజంలో ప్రభుత్వ పాఠశాలలపై చిన్నచూపు పోవాలన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక సదుపాయాలు, నాణ్యమైన విద్య అందుతోందన్నారు. బొట్టుగూడ పాఠశాలకు ఎంతో పేరు ప్రతిష్ఠలు ఉన్నాయని, ఇలాంటి పాఠశాల అద్దె భవనంలో, ఇరుకుగదుల్లో నిర్వహించడం తనను కలిచివేసిందన్నారు. దీన్ని దృష్టిలో ఉంచుకొని ప్రతీక్ ఫౌండేషన్ ద్వారా రూ.3కోట్లతో ప్రభుత్వ పాఠశాలను నిర్మించేందుకు నిర్ణయించినట్లు తెలిపారు. రానున్న ఆరేళ్లలో తెలంగాణలోనే ఈ పాఠశాలను ఆదర్శంగా తీర్చిదిద్ది, అన్ని ప్రాంతాల వారు ఇక్కడికి వచ్చి చూసేలా నిర్మాణాన్ని చేపడుతామన్నారు. సెప్టెంబరు 12న నల్లగొండ ప్రభుత్వ వైద్య కళాశాలను సీఎం రేవంత్‌రెడ్డి ద్వారా ప్రారంభింపజేయిస్తామన్నారు. బొట్టుగూడ విద్యార్థులు పదో తరగతిలో 10జీపీఏ నుంచి 9.5 జీపీఏ వరకు సాధిస్తే నగదు బహుమతి అందజేస్తానన్నారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ జే.శ్రీనివాస్, డీఈవో భిక్షపతి, మునిసిపల్ చైర్మన్ బుర్రి శ్రీనివాసరెడ్డి, ప్రతిక్ ఫౌండేషన్ సీఈవో ఎంవీ.గోనారెడ్డి, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు శంకరయ్య పాల్గొన్నారు. అంతకుముందు మునిసిపల్ పార్కులో నిర్వహించిన ప్రజావాణిలో ప్రజల నుంచి ఫిర్యాదులు తీసుకున్నారు. కార్యక్రమంలో పలువురు అధికారులు పాల్గొన్నారు.

శ్రీశైలం సొరంగం పనులను 26 నెలల్లో పూర్తిచేయిస్తా

కనగల్: సాగుతాగు నీటికి జిల్లాకు శాశ్వత పరిష్కారమైన శ్రీశైలం సొరంగం పనులను 26నెలల్లో పూర్తి చేయిస్తానని మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి అన్నారు. మండలంలోని చినమాదారం గ్రామంలో రూ.3.5కోట్లతో నిర్మించనున్న 33/11కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్‌కు గురువారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, బీఆర్ఎస్ హయాంలో నిధులు కేటాయించకపోవటంతో పనులు నిలిచాయని తెలిపారు. సీఎం రేవంత్‌రెడ్డిని ఒప్పించి సొరంగం పనులకు రూ. 2,200 కోట్లు కేటాయింపజేశామన్నారు. త్వరలో సొరంగం పనులు తిరిగి ప్రారంభమవుతాయని తెలిపారు. తొరగల్-చినమాదారం వరకు 5కి.మీ మేర డబుల్‌రోడ్డుకు రూ.13కోట్లతో త్వరలో పనులు ప్రారంభమవుతాయని తెలిపారు. అదేవిధంగా చినమాదారం నుంచి మారుపాక, ఎర్రగూడెం వరకు సింగిల్‌రోడ్డు ఏర్పాటుకు నిధులు కేటాయిస్తానన్నారు. గ్రామానికి చెందిన సీనియర్ నాయకుడు మల్లికంటి రాజు మంత్రి సమక్షంలో కాంగ్రెస్‌లో చేరారు. అంతకుముందు చినమాదారం హైస్కూల్‌ను సందర్శించి పాఠశాలలో సమస్యల పరిష్కారానికి రూ.50వేలు అందజేశారు. దివ్యాంగ విద్యార్థికి ట్రైసైకిల్ కొనుగోలుకు రూ.6వేలు ఇచ్చారు.

డ్రగ్స్ మహమ్మారిని నామరూపాల్లేకుండా తరుముదాం

చిట్యాలరూరల్: ఎంతో మందిని అనారోగ్యంపాలుచేస్తున్న డ్రగ్స్ మహమ్మారిని నామరూపాల్లేకుండా తరిమికొట్టాలని మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి పిలుపునిచ్చారు. మండలంలోని గుండ్రాంపల్లికి చెందిన విపంచి ఫౌండేషన్, అనంతుడు ఫౌండేషన్ సంయుక్తంగా రూపొందించిన ప్రచార పోస్టర్లను ఆయన నల్లగొండలో ఆవిష్కరించి మాట్లాడారు. యువతతో డ్రగ్స్ మహమ్మారికి దూరంగా ఉండాలని కోరారు.

ఓటరు జాబితా మ్యాపింగ్ పూర్తిచేయాలి : కలెక్టర్



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ నారాయణరెడ్డి

నల్లగొండ టౌన్, ఆగస్టు 29: ఓటరు జాబితాకు సంబంధించి మ్యాపింగ్ త్వరితగతిన పూర్తిచేయాలని కలెక్టర్ సి.నారాయణరెడ్డి అధికారులను ఆదేశించారు. గురువారం రాష్ట్ర ఎన్నికల కమిషనర్ పార్థసారథి హైదరాబాద్ నుంచి వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. వీడియో కాన్ఫరెన్స్ అనంతరం కలెక్టర్ జిల్లా అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఓటరు జాబితా మ్యాపింగ్‌ను నూరుశాతం పూర్తి చేయాలన్నారు. అలాగే ఓటరు జాబితా పరిశీలన కార్యక్రమాన్ని వారంలోపు పూర్తి చేయడంతో పాటు, ఆర్డీవోలు వెంటనే ఎంపీడీవోలతో సమావేశాలను ఏర్పాటు చేసి శిక్షణ ఇవ్వాలన్నారు. వచ్చేనెల 10 నాటికి ముసాయిదా పోలింగ్ కేంద్రాల జాబితా పూర్తిచేయాలని, ఓటరు జాబితా, పోలింగ్ కేంద్రాల గుర్తింపునకు ప్రాధాన్యం ఇవ్వాలన్నారు. ఓటర్ జాబితా మ్యాపింగ్ ఇప్పటి వరకు జిల్లాలో 37శాతం పూర్తయిందని, మిగతాది కూడా పూర్తిచేయాలన్నారు. గ్రామ పంచాయతీ ఓటరు జాబితా తయారీకి అసెంబ్లీ ఎన్నికల ఓటరు జాబితా ఆధారంగా ఎంపీడీవోలు, పంచాయతీ కార్యదర్శులు లాగిన్ల నుంచి డేటాను తీసుకోవాలన్నారు. ఓటరు జాబితాపై ఈనెల 30న ఆర్డీవోలు డివిజన్ స్థాయిలో ఎంపీడీవోలతో సమావేశం నిర్వహించాలన్నారు. ఫిబ్రవరి 9 నుంచి ఈ నెల 20 వరకు వచ్చిన అన్ని అభ్యంతరాలను పరిష్కరించాలని ఆదేశించారు. ఓటరు జాబితా మ్యాపింగ్‌ను త్వరితగతిన పూర్తి చేయాలని, వచ్చే నెల 5 నాటికి సిద్ధంగా ఉంచాలన్నారు. పోలింగ్ కేంద్రాల వివరాలకు వచ్చే నెల 10లోగా నోటిఫికేషన్ ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ టి.పూర్ణచంద్ర, జడ్పీ సీఈవో ప్రేమ్ కరణ్ రెడ్డి, డీపీవో మురళి, తదితరులు పాల్గొన్నారు.

వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ఐదుగురు మృతి

7

మాదకద్రవ్య రహిత జిల్లాగా మార్చడమే లక్ష్యం



సమావేశంలో మాట్లాడుతున్న ఎస్పీ శరత్‌చంద్ర పవార్

ఎస్పీ శరత్‌చంద్ర పవార్

కొండమల్లేపల్లి, దేవరకొండ, ఆగస్టు 29: మాదకద్రవ్యాల రహిత జిల్లాగా మార్చడమే మిషన్ పరివర్తన్ లక్ష్యమని ఎస్పీ శరత్‌చంద్రపవార్ అన్నారు. గురువారం మండలంలో గంజాయి బాధితులు 40 మంది యువకులకు వారి తల్లిదండ్రుల సమక్షంలో ఇచ్చిన కౌన్సిలింగ్‌లో ఆయన మాట్లాడారు. ఇప్పటికే జిల్లా వ్యాప్తంగా అన్ని పోలీస్‌స్టేషన్ల మాదకద్రవ్యాల టెస్టింగ్ కిట్లు ఏర్పాటు చేసినట్టు తెలిపారు. ప్రతీ రోజు డ్రంకెన్‌డ్రైవ్ తరహాలో జిల్లా వ్యాప్తంగా స్పెషల్ డ్రైవ్ నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ఒక్కసారి గంజాయి, ఇతర మత్తు పదార్థాలు వినియోగిస్తే ఆరు నెలల వరకు దాని ప్రభావం శరీరంలో ఉంటుందన్నారు. రెండోసారి మాదకద్రవ్యాలు తీసుకున్నవారు పట్టుబడితే ఆరు నెలల వరకు జైలుశిక్ష ఉంటుందన్నారు. కార్యక్రమంలో అదనపు ఎస్పీ రాములునాయక్, డీఎస్పీ గిరిబాబు, పలువురు సీఐలు, ఎస్ఐలు పాల్గొన్నారు. అదేవిధంగా ఎస్పీ దేవరకొండ పోలీస్‌స్టేషన్‌ను తనిఖీచేసి రికార్డులను పరిశీలించారు. దొంగతనాలు జరగకుండా పెట్రోలింగ్ నిర్వహించాలని, సీసీ కెమెరాలు ఏర్పాటు చేసి వ్యాపార సముదాయల నిర్వాహకులకు అవగాహన కల్పించాలన్నారు. రోడ్డు ప్రమాదాలు, సైబర్ నేరాలపై తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించాలన్నారు. డయల్ 100 ఫిర్యాదులపై వెంటనే స్పందించి ఆపదలో ఉన్నవారిని ఆదుకోవాలన్నారు. ఆయన వెంట డీఎస్పీ గిరిబాబు, సీఐ నర్సింహులు, ఎస్ఐ, తదితరులు ఉన్నారు.

యాదగిరీశుడికి లక్ష పుష్పార్చన

భువనగిరి అర్బన్, ఆగస్టు 28: యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహ స్వామి ఆలయంలో గురువారం ఏకాదశి పూజలు శాస్త్రోక్తంగా జరిగాయి. ప్రధానాలయ ముఖమండపంలో ఉత్సవమూర్తులను వివిధ పుష్పమాలికలు, పట్టువస్త్రాలు, బంగారు, వైడ్రవైఢూర్యాలతో దివ్యమనోహరంగా అలంకరించిన అర్చకస్వాములు ప్రత్యేక వేదికపై అధిష్ఠింపజేశారు. వేదమంత్రాలు, మంగళవాయిద్యాల నడుమ సహస్రనామా పఠనాలు, వివిధ రకాల పుష్పాలతో లక్ష పుష్పార్చన చేపట్టారు. పాంచరాత్రాగమన రీతిలో గంట



పూజలు నిర్వహిస్తున్న అర్చకులు

పాటు పూజ పర్వం కొనసాగింది. ఆలయంలో కణ్ణన్ తిరునక్షత్రోత్సవాల్లో భాగంగా సాయంత్రం ఉట్లోత్సవం ఉదయం గోశాలలో గోపూజలు వేదమంత్ర పఠనాల నడువ అర్చకస్వాములు వైభవంగా నిర్వహించారు. సాయంత్రం జరిగిన ఉట్లోత్సవంలో తూర్పురాజగోపురం నుంచి స్వామి అమ్మవార్ల సేవ రాగా ఎదురుగా భక్తులు ఉట్టి కొట్టారు. ఆలయ ఈవో భాస్కర్‌రావు ప్రారంభించారు. అంతకు ముందు ప్రధానార్చకుడు నల్లం ధీగల్ లక్ష్మీనరసింహ చార్యులు వేద మంత్రోచ్చరణలు ఆస్థాన విద్వాంసుల నడుమ ప్రత్యేక వేదికపై స్వామిఅమ్మవార్లను అధిష్ఠింపజేసి హారతి ఇచ్చారు. అదేవిధంగా ఉదయం మల్లాపురం గోశాలలో గోపూజలో ఈవో ఏ. భాస్కర్‌రావు, అనువంశిక ధర్మకర్త భాస్కరాయణీ నరసింహమూర్తి, డీఈవో భాస్కరశర్మ, ఏఈవో దూశెట్టి క్రిష్ణ, పర్యవేక్షకుడు రామరావు పాల్గొన్నారు. శ్రావణ మాసంలో చివరి శుక్రవారం ఉచిత వరలక్ష్మీ వ్రతాలు నిర్వహించనున్నట్లు ఆలయ ఈవో ఏ. భాస్కర్‌రావు తెలిపారు. మూడు రోజులుగా ఆలయ అధికారులు ఉచిత వ్రతాలపై ప్రచారం చేపట్టగా సుమారు 200మంది పేర్లు నమోదు చేసుకున్నట్లు చెప్పారు. కొండకింద వ్రత మండపంలో శుక్రవారం జరిగే వ్రతాలు భక్తులు పాల్గొని అమ్మవారి మొక్కుల తీర్చుకోవాలని కోరారు.

శాస్త్రోక్తంగా నిత్య పూజలు

స్వామివారి ఆలయంలో నిత్య కైంకర్యాలు పాంచారాత్రగమశాస్త్ర రీతిలో వైభవంగా నిర్వహించారు. ప్రధానాలయ నైరుతి దిశలో అష్టభుజి ప్రాకార మండపంలో ఉత్సవమూర్తులను పట్టువస్త్రాలు, ముత్యాలు, బంగారు, వజ్రవైఢూర్యాలతో దివ్యమనోహరంగా అలంకరించి ఆచార్యులు గజవాహన సేవలో తీర్చిదిద్ది వేదప్రమం పఠనాలు, మంగళవాయిద్యాల నడుమ సేవోత్సవం చేపట్టారు. ఉత్సవమూర్తులను కల్యాణమండపంలో అధిష్ఠింపజేసి విశ్వక్సేనుడి తొలిపూజలతో కల్యాణతంతు కొనసాగింది. కల్యాణోత్సవంలో పాల్గొన్న భక్తులను అర్చకులు స్వామివారి శేషవస్త్రాలు అందజేసి ఆశీర్వచనం చేశారు. ముందుగా సుదర్శన శతక పఠనంతో హోమం పూజలు నిర్వహించారు. కొండపైన శివాలయంలో శ్రీపర్వతవర్ధిని రామలింగేశ్వ రస్వామికి నిత్య పూజలు, యాగశాలలో నిత్య రుద్రహవనం శైవాగమ పద్ధతిలో నిర్వహించారు. వివిధ విభాగాల ద్వారా ఆలయ ఖజానాకు రూ. 40,12,733 ఆదాయం సమకూరిందని ఈవో ఏ. భాస్కర్‌రావు తెలిపారు.

వచ్చేనెల 1న ఖోఖో జిల్లా జట్ల ఎంపిక

దామరచర్ల, ఆగస్టు 29: ఉమ్మడి నల్లగొండ జిల్లా సబ్ జూనియర్ ఖోఖో బాలబాలికల జట్ల ఎంపికను వచ్చే నెల 1వ తేదీన నల్లగొండ జిల్లా దామరచర్ల మండలకేంద్రంలోని తెలంగాణ గిరిజన సంక్షేమ గురుకుల పాఠశాలలో నిర్వహిస్తున్నట్లు ఉమ్మడి జిల్లా ఖోఖో అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి నాతి కృష్ణమూర్తి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి గల క్రీడాకారులను జిల్లా ఖోఖో సంఘం బాధ్యులు, వ్యాయామ ఉపాధ్యాయులు, ఖోఖో కోచ్‌లు ఎంపికలో పాల్గొనాలన్నారు. క్రీడాకారులు తమ వయసు ధ్రువీకరణ పత్రం, ఆధార్‌కార్డు పత్రాలతో హాజరు కావాలని అన్నారు. ఎంపికైన క్రీడాకారులు సెప్టెంబరు 13, 14, 15వ తేదీల్లో ఖమ్మం జిల్లా కల్లూరులో జరిగే 34వ సబ్ జూనియర్ రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటారని పేర్కొన్నారు. వివరాలకు నాతి కృష్ణమూర్తి 9866368843, ఎస్.నాగేశ్వర్‌రావు 6300085314, డి.స్వాతి 9912754498 నెంబర్లను సంప్రదించాలని కోరారు.

అనుమానాస్పదస్థితిలో వివాహిత ఆత్మహత్య

దేవరకొండ, ఆగస్టు 29: అనుమానాస్పద స్థితిలో వివాహిత ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకుంది. ఈ సంఘటన నల్లగొండ జిల్లా గుర్రంపోడు మండలంలోని ముల్కలపల్లి గ్రామంలో గురువారం రాత్రి జరిగింది. ఎస్ఐ వేమిరెడ్డి నారాయణరెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన జాల రజిత(30) ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకుంది. భర్త దుర్గయ్య పశువులను కాసేందుకు వెళ్లాడు. రజిత ఇద్దరు పిల్లలు బుధవారం పోచంపల్లి గ్రామంలోని అమ్మమ్మ ఇంటికి వెళ్లారు. రజిత తమ్ముడు రమేష్ పిల్లలను తీసుకొని గురువారం ముల్కలపల్లికి వచ్చాడు. అప్పటికే రజిత రాగా ఇంట్లో ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకుంది. రజిత మృతిపై గ్రామానికి చెందిన జాల రాములుపై అనుమానం ఉన్నట్లు భర్త దుర్గయ్య పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

ఉరి వేసుకుని యువకుడు..

దేవరకొండ, ఆగస్టు 29: ఉరి వేసుకొని యువకుడు బలవన్మరణానికి పాల్పడ్డాడు. ఈ సంఘటన నల్లగొండ జిల్లా గుర్రంపోడు మండలంలోని కట్టవారిగూడెంలో గురువారం జరిగింది. గ్రామస్థులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన షేక్ జుబేర్(25) ట్రాక్టర్ డ్రైవర్‌గా పని చేస్తున్నాడు. గురువారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. అనారోగ్య కారణాల వల్ల ఆత్మహత్యకు పాల్పడినట్లు భావిస్తున్నారు. ఎలాంటి ఫిర్యాదు అందలేదని పోలీసులు తెలిపారు.

నవదంపతుల అపహరణ

- *పోలీసు వాహనం నుంచి తప్పించిన యువతి బంధువులు*
- *యువకుడికి ప్రాణహాని ఉందని బంధువుల ఆందోళన*

చౌటుప్పల్ రూరల్, ఆగస్టు 29: ప్రేమ వివాహం చేసుకొని పోలీసుల బందోబస్తుతో ఇంటికి వెళ్తున్న ప్రేమజంటను గురువారం రాత్రి సినీ ఫక్కీలో యువతి బంధువులు అపహరించారు. వివరాల ప్రకారం.. యాదాద్రి భువనగిరి జిల్లా చౌటుప్పల్ మండలం తాళ్లసింగారం గ్రామానికి చెందిన యువకుడు, రామన్నపేట మండలం ఎల్లంకి గ్రామానికి చెందిన యువతిని ప్రేమించి ఇటీవలే దేవాలయంలో పెళ్లిచేసుకున్నారు. పెళ్లికి ఇరువురి కుటుంబసభ్యులు అంగీకరించలేదు. గురువారం ప్రేమజంట పోలీసులను ఆశ్రయించింది. పోలీసులు ఇరువురి కుటుంబసభ్యులను పిలిపించి కౌన్సిలింగ్ ఇచ్చారు. అయినా యువతి తరుపు కుటుంబసభ్యులు అంగీకరించలేదు. తాను తన భర్తతోనే ఉంటానని యువతి చెప్పింది. తమకు ప్రాణహాని ఉందని పోలీసులు తమకు రక్షణ కల్పించి ఇంటింకి పంపించాలని నవ దంపతులు పోలీసులను కోరారు. ఆ దంపతులను పోలీసులు రాత్రి పెట్రోలింగ్ వాహనంలో ప్రియుడి ఇంటికి పంపిస్తుండగా సినీ ఫక్కీలో యువతి బంధువులు మార్గమధ్యలో పోలీసు వాహనాన్ని అడ్డుకుని, ప్రేమ జంటను అపహరించారు. గ్రామానికి వచ్చిన పోలీసు వాహనాన్ని తాళ్లసింగారం గ్రామస్థులు, యువకుడి బంధువులు అడ్డుకున్నారు. మీ సమక్షంలో ఉన్న ప్రేమజంటను ఎలా వదిలివేశారని, తమ కుమారుడిని వాళ్లు చంపివేస్తారని ఆందోళన వ్యక్తం చేశారు. ఎంత నచ్చచెప్పినా వినిపించుకోకుండా ఆందోళన కొనసాగించారు. ఈ విషయంపై సీఐ మన్మధరావును ప్రశ్నించగా యువకుడు క్షేమంగానే ఉన్నాడని తెలిపారు. ఆ యువతి తన తల్లితండ్రుల సమక్షంలో ఉందని పేర్కొన్నారు. యువతి కుటుంబసభ్యులపై కేసు నమోదు చేస్తామని చెప్పారు.

పోలీసుల అదుపులో అనుమానితుడు..?

కట్టంగూర్, ఆగస్టు 29: పెట్రోలింగ్ నిర్వహిస్తున్న పోలీసులు ఓ వ్యక్తి నుంచి 12తులాల బంగారం స్వాధీనం చేసుకున్నట్లు తెలిసింది. ఈ ఘటన నల్లగొండ జిల్లా కట్టంగూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో గురువారం రాత్రి జరిగినట్లు సమాచారం. విశ్వసనీయ సమాచారం మేరకు తెలిసిన వివరాలిలా ఉన్నాయి. కట్టంగూర్ పోలీస్ స్టేషన్ పరిధిలోని నల్లగొండ క్రాస్ రోడ్డు సమీపంలో పోలీసులు రోజు మాదిరిగానే వాహనాల్లో పెట్రోలింగ్ చేస్తున్నారు. ఆ సమయంలో అక్కడే ఉన్న ఓ గుడి వద్ద ముగ్గురు అపరిచిత వ్యక్తులు అనుమానాస్పదంగా కన్పించారు. పోలీసు పెట్రోలింగ్ వాహనాన్ని గమనించిన ఇద్దరు పారిపోగా ఒకరిని పోలీసులు అదుపులోకి తీసుకున్నట్లు తెలిసింది. పట్టుబడిన వ్యక్తిని విచారించే క్రమంలో అతని వద్ద సుమారు 12తులాల బంగారం ఉన్నట్లు గుర్తించారని సమాచారం. ఆ వ్యక్తులు ఎవరు..? ఎక్కడి నుంచి వచ్చారు..? ఎందుకు వచ్చారు..? బంగారం ఎక్కడిది అనే కోణంలో పోలీసులు విచారణ చేస్తున్నారు. దీనిపై ఎస్ఐ శ్రీనును వివరణ కోరగా సరైన సమాచారం లేదని విచారిస్తున్నామని చెప్పారు.

సాగర్ ప్రాజెక్టు నిండుకుండలా ఉన్నా..

పంటలకు నీరు వదలరా?

● అద్దంకి- నార్కట్‌పల్లి రహదారిపై రైతుల రాస్తారోకో



అద్దంకి-నార్కట్‌పల్లి రహదారిపై నిరసన వ్యక్తం చేస్తున్న రైతులు

మాడ్గులపల్లి, ఆగస్టు 29: నాగార్జునసాగర్ ప్రాజెక్టు నిండుకుండలా ఉన్నా నీరు వదలడం లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. నీరు విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ నల్లగొండ జిల్లా మాడ్గులపల్లి మండలం కుక్కడం, అబంగాపురం, ఐలాపురం, పూసలపాడు గ్రామాల రైతులు గురువారం మండలంలోని కుక్కడం గ్రామంలో అద్దంకి నార్కట్‌పల్లి రహదారిపై నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వరదకాల్వ ద్వారా 50వేల ఎకరాల ఆయకట్టుకు నీరందించేందుకు 85 కిలోమీటర్ల మేరా కాల్వ నిర్మించినా నీరు కిందకు రాకపోవడంతో పెట్టిన పంటలకు నీరందడం లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. వర్షాధారం, బోరుబావుల మీద ఆధారపడి రైతులు పంటలు సాగు చేసినా వరదకాల్వ నీరు రాకపోవడంతో బోరుబావులు ఎండిపోతున్నాయన్నారు. వరదకాల్వ పెద్దవూర మండలం పుల్యాతండా నుంచి ప్రారంభమై హాలియా, నిడమనూరు, కనగల్, మాడ్గులపల్లి, వేములపల్లి మండలంలోని మొల్కపట్నం వరకు సాగునీటిని అందించడంతోపాటు చెరువులను నింపేందుకు నిర్మించారని, మాడ్గులపల్లి మండలంలోని కన్నెకల్ నుంచి నారాయణపురం, యాచారం, చెరుపల్లి, మాడ్గులపల్లి, కుక్కడం, తోపుచర్ల, మొల్కపట్నం వరకు 13వేల ఎకరాలకు సాగునీరు అందించేందుకు కాల్వలు ఉన్నా నీరు రాకపోవడంతో పంటలు ఎండిపోతున్నాయన్నారు. అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించి కిందకు నీటిని విడుదల చేసి ఆదుకోవాలని కోరారు. విషయం తెలుసుకున్న పోలీసులు రైతుల వద్దకు వచ్చి మాట్లాడారు. నీటిపారుదలశాఖ అధికారులతో మాట్లాడి నీటిని కిందకు పంపిస్తామని ఫోన్‌లో మాట్లాడడంతో రైతులు ఆందోళన విరమించారు. పావుగంట సేపు నిరసన వ్యక్తం చేయడంతో కిలో మీటర్ మేరా వాహనాల రాకపోకలకు అంతరాయం ఏర్పడింది.

బోరు బావిలో పడి వ్యక్తి మృతి



వెంకటేష్ (ఫైల్)

అడ్డగూడూరు, ఆగస్టు 29: వ్యవసాయ బోరు బావిలో పడి వ్యక్తి మృతి చెందాడు. ఈ సంఘటన యాదాద్రిభువనగిరి జిల్లా అడ్డగూడూరు మండలం లోని లక్ష్మీదేవికాల్వలో గురువారం జరిగింది. ఎస్‌ఐ నాగరాజు, స్థానికులు తెలి పిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన పర్రెపాటి సైదులు, లక్ష్మీ దంపతులు, కూమారుడు వెంకటేష్(27) కలిసి వ్యవసాయం చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. మోటారు నీళ్ల పోయక పోవడంతో తండ్రి సైదులుతో కలిసి వెంకటేష్ గురువారం వ్యవసాయ బోరు బావి వద్దకు వెళ్లాడు. బావి మధ్యలో ఉన్న మోటారుకు కంట్రోల్ వాచర్ అమరుస్తుండగా వెంకటేష్ కాలు జారి బావిలో పడిపోయాడు. గమనించిన తండ్రి సైదులు కేకలు వేయడంతో చుట్టు పక్కల ఉన్న రైతులు అక్కడికి చేరుకొని తాళ్లసాయంతో బావిలోకి దిగారు. వెంకటేష్‌ను బయటికి తీసుకొచ్చారు. అప్పటికే ఆయన మృతిచెంది ఉన్నాడు. రైతులు పోలీసులకు సమాచారం సమాచారం ఇచ్చారు. ఎస్‌ఐ నాగరాజు సంఘటనా స్థలానికి చేరుకొని పంచనామా నిర్వహించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం రామన్నపేట ఏరియా ఆస్పత్రికి తరలించారు. వెంటేష్ తల్లి లక్ష్మి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

స్నేహితులతో ఆడుకుంటూ..



ఈశ్వర్(ఫైల్)

కొండమల్లేపల్లి: స్నేహితులతో కలిసి ఆడుకుంటున్న క్రమంలో నీటి సంపులో పడి బాలుడు మృతిచెం దాడు. ఈ సంఘటన గురువారం రాత్రి నల్లగొండ జిల్లా కొండమల్లేపల్లి మండలకేంద్రంలో జరిగిది. ఏపీ రాష్ట్రం కర్నూల్ జిల్లాకు చెందిన చాకలి వీరస్వామి-ఉమ దంపతులు బతుకు దెరువు కోసం మూడు సంవత్సరాల క్రితం మండలకేంద్రానికి వచ్చి తాపీ మేస్త్రీగా పని చేస్తూ జీవనం సాగిస్తున్నారు. వారికి ముగ్గురు కుమార్తెలు, కుమారుడు ఈశ్వర్(6) ఉన్నారు. గురువారం రాత్రి స్థానిక పాతూరిలో గల ఆంజనేయస్వామి ఆలయం సమీపం లో ఈశ్వర్ సేహితులతో ఆడు కుంటుండగా పక్కనే ఉన్న నీటిసంపులో పడ్డాడు. గమనించిన చిన్నారులు చుట్టుపక్కల వారికి చెప్ప డంతో వారు వెంటనే వచ్చి బాలుడిని సంపు నుంచి బయటకు తీశారు. చికిత్స నిమిత్తం దేవరకొండ ప్రభుత్వాసుపత్రికి తరలించగా అప్పటికే బాలుడు మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. ఈ ఘటనపై ఫిర్యాదు అందలేదని ఎస్‌ఐ రాంమ్మూర్తి తెలిపారు.

28 క్వింటాళ్ల రేషన్ బియ్యం పట్టివేత



పోలీసులు స్వాధీనం చేసుకున్న రేషన్ బియ్యం

మునగాల రూరల్, ఆగస్టు 29: సూర్యాపేట జిల్లా మునగాల మండల ప రిధిలోని వెంకట రాంపురంలో గురువారం తెల్లవారుజామున 28 క్వింటాళ్ల రేషన్ బియ్యం స్వాధీనం చేసుకున్నారు. ఎస్‌ఐ ప్రవీణ్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకా రం.. గ్రామశివారులోని కోళ్లఫారం పక్కన ఉన్న షెడ్డులో పీడీఎస్ బియ్యం బస్తా లు డంప్ చేసి ఉన్నట్లు నమ్మదగిన సమాచారం మేరకు పోలీ సులు తని ఖీలు నిర్వహించారు. 64బస్తాల్లో 28క్వింటాళ్ల పీడీఎస్ బియ్యం పట్టుకున్నట్లు ఎస్‌ఐ తెలిపారు. మండల పరిధిలోని నేలమర్రి గ్రామానికి చెందిన గుడిపూడి నగేష్ తక్కువ ధరకు రేషన్‌బియ్యం కొనుగోలు చేసి అధిక ధరలకు విక్రయించి వ్యాపారం చేస్తున్నాడని, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

26 గేట్ల ద్వారా సాగర్ నీటి విడుదల

● ఎగువ నుంచి 3,48,235 క్యూసెక్కుల వరద రాక

నాగార్జునసాగర్, కేతేపల్లి, మేళ్లచెర్వు, దామరచర్ల, ఆగస్టు 29: నాగార్జునసాగర్ ప్రాజెక్టు 26 క్రస్ట్ గేట్ల నుంచి నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. ఎగువ నుంచి వరద రాక పెరగడంతో బుధవారం అర్ధరాత్రి నుంచి 22 క్రస్ట్ గేట్ల ద్వారా నీటిని విడుదల చేసిన అధికారులు గురువారం ఉదయం 9గంటలకు 24 క్రస్ట్ గేట్ల ద్వారా, 10గంటలకు 26 క్రస్ట్ గేట్ల ద్వారా నీటి విడుదల కొనసాగిస్తున్నారు. సాగర్‌కు ఎగువన ఉన్న శ్రీశైలం ప్రాజెక్టుకు ఎగువ నుంచి 2,86,434 క్యూసెక్కుల వరద వచ్చి చేరుతోంది. శ్రీశైలం ప్రాజెక్టు నీటిమట్టం 885అడుగులు కాగా, ప్రస్తుతం 884.80 అడుగులుగా(214.3633టీఎంసీలుగా) ఉంది. దీంతో శ్రీశైలం ప్రాజెక్టు 10క్రస్ట్ గేట్లను 10అడుగుల మేరకు ఎత్తి 2,79,830 క్యూసెక్కుల నీటిని, కుడి గట్టు జలవిద్యుత్ కేంద్రంలో విద్యుత్ ఉత్పత్తి చేస్తూ 30,523 క్యూసెక్కుల నీటిని, ఎడమ గట్టు జలవిద్యుత్ కేంద్రంలో విద్యుత్‌ను ఉత్పత్తి చేస్తూ 37,882 క్యూసెక్కుల నీటిని సాగర్‌కు వదులుతున్నారు. శ్రీశైలం నుంచి సాగర్‌కు మొత్తం 3,48,235 క్యూసెక్కుల వరద నీరు వచ్చి చేరుతోంది. సాగర్ ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటిమట్టం 590 అడుగులు కాగా, ప్రస్తుతం 590 అడుగులు (312.0450టీఎంసీలు)గా ఉంది. సాగర్ నుంచి కుడి కాల్వ ద్వారా 9,382 క్యూసెక్కులు, ఎడమ కాల్వ ద్వారా 8280 క్యూసెక్కులు, ప్రధాన జలవిద్యుత్ కేంద్రం ద్వారా 28,461 క్యూసెక్కులు, ఎస్‌ఎల్‌బీసీ ద్వారా 1,800 క్యూసెక్కులు, వరద కాల్వ ద్వారా 600 క్యూసెక్కుల నీటిని, మొత్తం 26 క్రస్ట్ గేట్లల్లో 14 క్రస్ట్ గేట్లను 10అడుగుల మేరకు, 12 క్రస్ట్‌గేట్లను ఐదు అడుగుల మేరకు ఎత్తి 3,07,382 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. సాగర్ నుంచి మొత్తం 3,55,910 నీరు విడుదలవుతుండగా, ఎగువ నుంచి 3,48,235 క్యూసెక్కుల నీరు వచ్చి చేరుతోంది.

పులిచింతల ప్రాజెక్టు 14 గేట్లు ఎత్తివేత

తెలుగు రాష్ట్రాల సరిహద్దులోని పులిచింతల ప్రాజెక్టుకు ఎగువ నుంచి వరద ప్రవాహం పెరగడంతో 14 గేట్లను ఎత్తి 3,24,393 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటిమట్టం 175 అడుగులు(45.77 టీఎంసీలు) కాగా, గురువారం సాయంత్రానికి 171.91అడుగులు (41 టీఎంసీలు)గా నమోదైంది. ప్రాజెక్టు ఇన్‌ఫ్లో 2,75,393 క్యూసెక్కులుగా నమోదైంది. తెలంగాణ జలవిద్యుత్ కేంద్రం నుంచి నాలుగు యూనిట్ల ద్వారా 16వేల క్యూసెక్కుల నీటిని వినియోగిస్తూ 102 మెగావాట్ల విద్యుత్‌ను ఉత్పత్తి చేస్తుండగా, మొత్తం ప్రాజెక్టు అవుట్‌ఫ్లో 3,40,393 క్యూసెక్కులుగా నమోదైంది. ఎగువ నుంచి వరద ప్రవాహం కొనసాగుతుండడంతో ప్రాజెక్టుకు ఇన్‌ఫ్లో కంటే ఔట్‌ఫ్లో అధికంగా నమోదైంది.

నిలకడగా మూసీ నీటిమట్టం

మూసీ ప్రాజెక్టుకు నీటిమట్టం 643.40అడుగుల వద్ద నిలకడగా కొనసాగుతోంది. వారం రోజుల పాటు ఎగువ నుంచి మోస్తరుగా ఉన్న ఇన్‌ఫ్లో రెండు రోజులుగా తగ్గింది. దీంతో మూసీ ప్రాజెక్టు నీటిమట్టంలో హెచ్చుతగ్గులు లేకుండా నిలకడగా కొనసాగుతోంది. ఎగువ మూసీ పరివాహక ప్రాంతాలో వర్షాలు లేకపోవడంతో ప్రాజెక్టులోకి వచ్చే ఇన్‌ఫ్లో 503క్యూసెక్కులుగా నమోదైంది. 645అడుగుల (4.46టీఎంసీలు) పూర్తిస్థాయి నీటినిల్వ సామర్థ్యం ఉన్న మూసీ ప్రాజెక్టు ప్రస్తుత నీటిమట్టం 643.40అడుగులు(4.04టీఎంసీ)గా ఉంది. మూసీ ఆయకట్టులో వానాకాలం పంటల సాగుకు ప్రాజెక్టు కుడి కాల్వకు 239.40క్యూసెక్కులు, ఎడమ కాల్వకు 263.34 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. మొత్తంగా మూసీ నుంచి 502.74 క్యూసెక్కులు దిగువకు విడుదల చేస్తున్నారు.



నాగార్జునసాగర్ ప్రాజెక్టు 26 క్రస్ట్‌గేట్ల నుంచి విడుదలవుతున్న నీరు

కొనసాగుతున్న నీటి విడుదల

ఎగువ నాగార్జునసాగర్ నుంచి పెద్దఎత్తున దిగువకు నీటిని విడుదల చేస్తుండడంతో గురువారం అడవిదేవులపల్లి మండలకేంద్రం శివారులోని టెయిల్ పాండ్ నుంచి దిగువకు నీటిని విడుదల చేస్తున్నారు. నాగార్జునసాగర్ జలాశయం నుంచి టెయిల్ పాండ్‌కు 3,35,843 క్యూసెక్కుల నీరు టెయిల్‌పాండ్‌కు వస్తోంది. దీంతో టెయిల్ పాండ్‌లోని 16గేట్లను 4మీటర్ల మేరా ఎత్తి 3,31,680 క్యూసెక్కుల నీటిని దిగువ పులిచింతలకు విడుదల చేస్తున్నట్లు అధికారులు తెలిపారు.

వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ఐదుగురు మృతి



తల్లి మృతదేహం వద్ద రోదిస్తున్న కృష్ణ

కేతేపల్లి, ఆగస్టు 29: నిద్ర మత్తు ఒకరి ప్రాణం తీసింది. కారు అదుపు తప్పి డివైడర్‌ను ఢీకొట్టి పల్టీలు కొట్టడంతో ఒకరు మృతిచెందారు. మరో ఇద్దరు తీవ్రంగా పడ్డారు. ఈ సంఘటన నల్లగొండ జిల్లా కేతేపల్లి మండలకేంద్రంలో గురువారం జరిగింది. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. హైదరాబాద్ మియాపూర్‌కు చెందిన సొంటి కృష్ణసంతోష్ విజయవాడలో తన మేనత్త అంత్యక్రియలకు హాజరయ్యేందుకు తల్లిదండ్రులు దుర్గామల్లేష్ ప్రసాద్, శివనాగమల్లేశ్వరి(63), మేనత్తలు పామర్తి పార్వతి, గుడిపల్లి అలివేలమ్మలతో కలిసి గురువారం తెల్లవారుజామున మూడు గంటల ప్రాంతంలో కారులో హైదరాబాద్ నుంచి విజయవాడకు బయల్దేరారు. కారు ఉదయం ఆరు గంటల సమయంలో కేతేపల్లికి చేరేసరికి కారు నడుపుతున్న సొంటి కృష్ణను నిద్రమత్తు ఆవరించింది. దీంతో అదుపు తప్పిన కారు కేతేపల్లి డీపాల్ స్కూల్ వద్ద గల జంక్షన్‌లోకి దూసుకెళ్లి డివైడర్‌ను ఢీకొని పల్టీ కొట్టింది. ప్రమాదధాటికి కారు ముందు ఎడమ చక్రం విరిగి దూరంగా పడింది. కారులోని ఎయిర్ బ్యాగులు తెరుచుకోవడంతో ముందు సీట్లలో ఉన్న వారు స్వల్ప గాయాలతో బయటపడ్డారు. కారు వెను సీటులో కూర్చున వారిలో సొంటి కృష్ణసంతోష్ తల్లి శివనాగమల్లేశ్వరి(63) ప్రమాద తీవ్రతకు భయాందోళనకు గురై అక్కడికక్కడే మృతి చెందింది. ప్రమాదంలో గాయపడిన దుర్గామల్లేష్ ప్రసాద్, పామర్తి పార్వతి, గుడిపల్లి అలివేలమ్మలను చికిత్స నిమిత్తం నకిరేకల్ ఏరియా ఆస్పత్రికి తరలించారు. మెరుగైన చికిత్స నిమిత్తం క్షతగాత్రులను హైదరాబాద్‌కు తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ శివతేజ వివరించారు.

గుర్తుతెలియని వాహనం ఢీకొని..

సంస్థాన్ నారాయణపురం: యాదాద్రిభువనగిరి జిల్లా సంస్థాన్ నారాయణపురం మండలంలోని గుడిమల్కాపురం శివారులో గురువారం జరిగిన రోడ్డు ప్రమాదంలో వృద్ధుడు మృతిచెందాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మర్రిగూడ మండలంలోని ఇందుర్తి గ్రామానికి చెందిన పందరి రాములు(59) తన మనవడి బారసాల కొసం బుధవారం మోపెడ్ వాహనంపై చౌటుప్పల్ మండలం తంగడపల్లి గ్రామానికి వచ్చాడు. గ్రామంలో ఇంటి దగ్గర నిర్మాణ పనులకు సంబంధించి కూలీలు వస్తారని గురువారం తెల్లవారుజామున తన మోపెడ్ వాహనంపై ఇంటికి బయలుదేరాడు. మండలంలోని గుడిమల్కాపురం గ్రామ శివారులో గుర్తుతెలియని వాహనం ఢీకొనడంతో తలకు తీవ్ర గాయాలయ్యాయి. వాహనాదారులు గుర్తించి పోలీసులకు సమచారం అందించారు. పోలీ సులు సంఘటనా స్థలానికి చేరుకుని చికిత్స నిమిత్తం చౌటుప్పల్ ఆసుపత్రికి తీసుకొచ్చారు. అక్కడ నుంచి మెరుగైన చికిత్స కొసం హైదరాబాద్‌కు తరలిస్తుండగా మార్గమధ్యలో మృతిచెందాడు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ జగన్ తెలిపారు.

పెళ్లి పత్రికలు పంచడానికి వెళ్తూ..

పెద్దఅడిశర్లపల్లి: అక్క పెళ్లికార్డులు పంచడానికి వెళ్లి రోడ్డు ప్రమాదంలో సోదరుడి స్నేహితుడు మృత్యువాత పడ్డాడు. ఈ సంఘటన నల్లగొండ జిల్లా పెద్దఅడిశర్లపల్లి మండలం కోదాడ- జడ్చర్ల జాతీయ రహదారిలోని చిలకమర్రి స్టేజీ సమీపంలో గురువారం జరిగింది. గుడిపల్లి ఎస్‌ఐ తెలిపిన వివరాల ప్రకారం.. రంగారెడ్డి జిల్లా మాడ్గుల మండలం పల్లెతండకు చెందిన కేతావత్ సంతోష్ అక్క అయిన అనూష పెళ్లి ఈ నెల 31న జరగాల్సి ఉంది. దీంతో పెళ్లి పత్రికలు పంచడానికి గురువారం రాత్రి సంతోష్ తన స్నేహితుడు నేనావత్ రాజేష్(19)ను వెంటబెట్టుకుని నల్లగొండ జిల్లా నాగార్జునసాగర్ పరిధిలోని నాగార్జునపేటతండాకు బైక్‌పై బయలుదేరారు. పెద్దఅడిశర్లపల్లి మండలం కోదాడ- జడ్చర్ల జాతీయ రహదారిలోని చిలకమర్రి స్టేజీ సమీపంలో స్పీడ్ బేకర్ల వద్ద రాగానే బైక్ అదుపుతప్పి గుర్తుతెలియని వాహనాన్ని ఢీకొని వాహనం నడుపుతున్న నేనావత్ రాజేష్ అక్కడికక్కడే మృతిచెందాడు. గాయపడిన సంతోష్‌ను కొండమల్లేపల్లి నుంచి వస్తున్న గుడిపల్లి ఎస్‌ఐ నర్సింహులు వెంటనే ఆసుపత్రికి తరలించారు. రాజేష్ మృతదేహాన్ని దేవరకొండ ప్రభుత్వ ఆస్పత్రి మార్చురీకి తరలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

లారీ ఢీకొని బీఫార్మసీ విద్యార్థిని మృతి

గరిడేపల్లి: సూర్యాపేట జిల్లా గరిడేపల్లి మండలంలో గురువారం జరిగిన రోడ్డు ప్రమాదంలో బీఫార్మసీ విద్యార్థిని మృతిచెందింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. కోదాడ మండలం గణపవరం గ్రామానికి చెందిన పిడమర్తి ప్రవంతి కోదాడలోని తేజ కళాశాలలో బీఫార్మసీ ఫైనలియర్ చదువుతోంది. పాలకవీడు మండలం గుడుగుంట్ల పాలెం గ్రామానికి చెందిన తన బంధువైన బంక నాగరాజు బైక్‌పై ప్రవంతిని ఎక్కించుకొని గుడుగుంట్లపాలెం గ్రామానికి కోదాడ నుంచి బయలుదేరారు. కోదాడ మిర్యాలగూడెం ప్రధాన రహదారిపై సాయంత్రం 4గంటల సమయంలో గరిడేపల్లి మండల పరిధిలోని అప్పన్నపేట గ్రామ శివారులోకి రాగానే వెనుక నుంచి వస్తున్న లారీ డ్రైవర్ మద్యం మత్తులో నాగరాజు బైక్‌ను ఢీకొట్టాడు. ఈ ప్రమాదంలో బైక్ వెనుకాల కూర్చున్న ప్రవంతి(19) అక్కడికక్కడే మృతి చెందింది. నాగరాజుకు తీవ్ర గాయాలు కావడంతో 108లో హుజూర్‌నగర్ ఏరియా ఆస్పత్రికి తరలించారు. నాగరాజు కోదాడలోని ప్రైవేట్ హాస్టల్‌లో వార్డెన్‌గా పని చేస్తున్నట్లు సమాచారం. ఈ ప్రమాదంపై ఎలాంటి ఫిర్యాదు అందలేదని ఎస్‌ఐ చలిగంటి నరేష్ తెలిపారు.

ట్రాక్టర్ ఎదురుగా రావడంతో..



చివ్వెంల: సూర్యాపేట జిల్లా చివ్వెంల మండలకేంద్రం శివారులో గురువారం జరిగిన రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతిచెందాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మోతె మండలం సిరికొండ గ్రామానికి చెందిన బోడపట్ల జానుగౌడ్ (42)ద్విచక్ర వాహనంపై సూర్యాపేట జిల్లాకేంద్రానికి వస్తున్నాడు. చివ్వెంల మండలకేంద్రం శివారులోని దీవెన కళాశాల సమీపంలో ట్రాక్టర్ ఎదురుగా వచ్చి ఢీకొంది. దీంతో జానుగౌడ్‌కు తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు ప్రభుత్వ జనరల్ ఆసుపత్రికి తరలించగా మార్గమధ్యలో మృతిచెందాడు. జానుగౌడ్‌కు భార్య, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. భార్య ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

భార్య చేతిలో భర్త హతం



హత్యకు గురైన వెంకన్న

నల్లగొండ క్రైం, ఆగస్టు 29: ప్రియుడి మోజులో భర్తను హత్య చేసిన సంఘటన నల్లగొండ వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. మృతుడి బంధువులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. నల్లగొండ వన్‌టౌన్ స్టేషన్ పరిధిలోని ఏఆర్‌నగర్‌కు చెందిన ఓర్సు వెంకన్న(55) కూలీ పని చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. ఆయన భార్య ఓర్సు మైసమ్మ వెలుగుపల్లి గ్రామానికి చెందిన ఓ వ్యక్తితో వివాహేతర సంబంధం పెట్టుకుంది. వారి ఏకాంతానికి అడ్డుగా వస్తున్న భర్తను హత్య చేసేందుకు ప్రణాళిక రూపొందించింది. అందులో భాగంగా బుధవారం రాత్రి సమయంలో ఏఆర్‌నగర్‌లోని వారు నివాసం ఉండే ఇంట్లో ఇరువురు ఘర్షణ పడ్డారు. దీంతో వెంకన్నను బలంగా నెట్టివేయగా వెనకకు పడటంతో రాయి తగిలి తలకు గాయమైంది. ఇదే అదునుగా భావించిన వెంకన్న భార్య మైసమ్మ అతడి ఛాతిపై కూర్చొని బలంగా గొంతునులమడంతో ప్రాణాలు కోల్పోయాడు. వెంకన్న చనిపోయాడు అని నిర్ధారించుకున్న తర్వాతే మైసమ్మ అతడి ఛాతిపై నుంచి లేచి తన భర్త చనిపోయాడని నమ్మించే ప్రయత్నం చేసేందుకు కాలనీవాసుల వద్ద బోరున విలపించింది. మైసమ్మకు వెలుగుపల్లి గ్రామానికి చెందిన ఓ వ్యక్తికి వివాహేతర సంబంధం ఉన్నట్లు కాలనీవాసులకు కూడా తెలవడంతో వారు అనుమానం వ్యక్తం చేశారు. ఆరునెలల క్రితం నుంచి భార్యాభర్తల మధ్య వివాదాలు జరుగుతుండగా, మైసమ్మ తన తల్లిగారి ఇంటికి వెళ్లిపోయింది. మైసమ్మ భర్త వెంకన్న ఆమె వద్దకు వెళ్లి బతిమిలాడి తిరిగి తీసుకువచ్చుకున్నాడు. అయినా వారి కుటుంబంలో పలుమార్లు ఈ విషయంపై వివాదాలు జరుగుతూనే ఉన్నాయి. బుధవారం సాయంత్రం సమయంలో కూడా మైసమ్మ వెలుగుపల్లి గ్రామానికి చెందిన తన ప్రియుడితో కలిసి వెంకన్నను హత్య చేసేందుకు చర్చించినట్లు పోలీసులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. వెంకన్నకు ముగ్గురు కుమార్తెలు, ఇద్దరు కుమారులు ఉన్నారు. అతడి అన్న కుమారుడు ఓర్సు శ్రీను ఫిర్యాదు మేరకు నల్లగొండ వన్‌టౌన్ సీఐ ఏమిరెడ్డి రాజశేఖర్‌రెడ్డి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

శరతులు లేకుండా ప్రభుత్వం

రుణమాఫీ చేయాలి

● సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు జూలకంటి



మాట్లాడుతున్న సీపీఎం నాయకుడు జూలకంటి రంగారెడ్డి

నల్లగొండ టౌన్, ఆగస్టు 29: కాంగ్రెస్ పార్టీ గత అసెంబ్లీ ఎన్నికల్లో ఇచ్చిన హామీ ప్రకారం ఎలాంటి షరతులు, ఆంక్షలు లేకుండా రైతులందరికీ రుణాలు మాఫీ చేయాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు జూలకంటి రంగారెడ్డి డిమాండ్ చేశారు. సీపీఎం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఎదుట గురువారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రుణమాఫీపై ప్రభుత్వం స్పష్టత ఇవ్వాలన్నారు. ప్రతి రైతుకూ రుణమాఫీ చేయాలని డిమాండ్ చేశారు. రూ.2లక్షల రుణమాఫీ అనేది సహోసపేతమైన నిర్ణయమని అన్నారు. తొలత ప్రతి రైతుకూ రూ.2 లక్షలు అని చెప్పిన ప్రభుత్వం తర్వాత రైతు కుటుంబానికి అని మాట మార్చిందని, అది కూడా అందరికీ మాఫీ చేయడం లేదన్నారు. రుణమాఫీ కోసం రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసిన జీవో 567 అనేక నిబంధనలు విధించడంతో రైతులు రుణమాఫీ పొందలేని పరిస్థితి ఉందన్నారు. ఇప్పటి వరకు రూ.22లక్షల మంది రైతుల ఖాతాల్లో రూ.18వేల కోట్లకు పైగా జమ చేసినట్లు ప్రభుత్వం ప్రకటించిందని గుర్తుచేశారు. ఎన్నికల సమయంలో ఏక కాలంలో రూ.2లక్షలు మాఫీ చేస్తామని ప్రకటించారన్నారు. రుణమాఫీ 40శాతం కూడా పూర్తి చేయలేదన్నారు. రైతులు బ్యాంకులు, వ్యవసాయాధికారుల చుట్టూ తిరుగుతున్నారన్నారు.

ఇప్పటికైనా ప్రభుత్వం ఎన్నికల్లో చేసిన వాగ్దానం ప్రకారం రుణం తీసుకున్న ప్రతిరైతుకు రుణమాఫీ వర్తింపచేయాలన్నారు. అలాగే రైతుభరోసా నిధులను వెంటనే విడుదల చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. పలు జిల్లాలో క్యాబినేటు సబ్ కమిటీ అభిప్రాయాలు సేకరించిన రైతు పెట్టుబడికి భరోసా నిధులను ఎందుకు విడుదల చేయడంలేదని ప్రశ్నించారు. విధివిధానాలు ఎపుడైనా తయారు చేసుకోవచ్చని వ్యవసాయ సీజన్ ప్రారంభమైనందున రైతులు ప్రైవేట్ వడ్డీ వ్యాపారులను ఆశ్రయించాల్సివస్తుందని ఆందోళన వ్యక్తం చేశారు. రైతు బీమా పథకానికి సంబంధించిన ప్రీమియం వెంటనే చెల్లించాలని ప్రభుత్వాన్ని కోరారు. గత ప్రభుత్వం లాగా కాంగ్రెస్ ప్రభుత్వం కూడా కాలయాపన చేస్తే తగిన సమయంలో రైతులు ప్రభుత్వానికి బుద్ధిచెబుతారని అన్నారు. ఆందోళనలో ఉన్న రైతులకు ప్రభుత్వం భరోసా కల్పించాలని కోరారు. సీపీఎం జిల్లా కార్యదర్శి ముదిరెడ్డి సుధాకర్‌రెడ్డి మాట్లాడుతూ జిల్లాలో రైతులకు పట్టాదారు పాస్‌పుస్తకాలు 5లక్షల 42 వేల 306 ఉండగా ఇప్పటి వరకు 1,71,781 మంది రైతులకకు రుణమాఫీ అయిందన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఎం నాయకులు బండ శ్రీశైలం, కందాల ప్రమీల, పాలడుగు నాగార్జున, ప్రభావతి, సయ్యద్ హాషం, సిహెచ్ లక్ష్మీనారాయణ, వీ. వెంకటేశ్వర్లు, ఎండి సలీం, పి. నర్సిరెడ్డి, అవిశెట్టి శంకరయ్య, జిట్టా నగేష్, బొజ్జ చిన్నవెంకులు, ఎం రవినాయక్, కంబాలపల్లి ఆనంద్, నన్నూరి వెంకటరమణారెడ్డి, దండెంపల్లి సత్తయ్య, రొండి శ్రీనివాస్, వెంకన్న, నాంపల్లి చంద్రమౌళి, మల్లం మహేష్, సరోజ, పద్మ, సైదులు, మన్నెం బిక్షం, గోవర్ధన, కుంభం క్రిష్ణారెడ్డి పాల్గొన్నారు.

గురుకుల విద్యార్థులకు రక్షణ కరువు

● ఎలుకలు, క్రిమికీటకాలతో ఇబ్బందులు ● పట్టించుకోని అధికారులు ● గురుకులాలకు ప్రహరీలు కరువు



ప్రహరిలేని కొమ్మెపల్లి గిరిజన బాలుర గురుకుల పాఠశాల

దేవరకొండ, ఆగస్టు 29: నల్లగొండ జిల్లా దేవరకొండ డివిజన్‌లో గురుకుల పాఠశాలల విద్యార్థులకు రక్షణ కరువైంది. పాఠశాలలకు ప్రహరీ లేకపోవడంతో క్రిమికీటకాలు, ఎలుకలు పాఠశాలలోకి వచ్చి నిద్రిస్తున్న విద్యార్థులను కరుస్తున్నాయి. దీంతో విద్యార్థులు భయాందోళన చెందుతున్నారు. డిండి మండలంలోని ఎస్సీ గురుకుల పాఠశాలలో జూలై నెలలో 16 మంది విద్యార్థులను ఎలుకలు కరవడంతో తీవ్ర అస్వస్థతకు గురయ్యారు. ఆ సంఘటన మరువకముందే తాజాగా దేవరకొండ మండలం కొండభీమనపల్లి బీసీ గురుకుల పాఠశాలలో ఈ నెల 26న నిద్రిస్తున్న 14మంది విద్యార్థులను ఎలుకలు కరిచాయి. దీంతో విద్యార్థులు భయాందోళన చెందడంతో పాఠశాల ఉపాధ్యాయులు, సిబ్బంది హుటాహుటిన వాహనాల్లో సమీపంలోని తూర్పుపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తరలించారు. సకాలంలో విద్యార్థులకు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వైద్యం అందడంతో విద్యార్థులకు ప్రమాదం తప్పింది. దేవరకొండ మండలం కొమ్మెపల్లి గిరిజన గురుకుల పాఠశాలలో ప్రహరీ లేకపోవడంతో తేళ్లు, పాములు రాత్రివేళలో పాఠశాల ఆవరణంలోకి వస్తున్నాయని విద్యార్థులతోపాటు ఉపాధ్యాయులు భయాందోళన చెందుతున్నారు. గిరిజన ఆశ్రమ పాఠశాలకు ప్రహరీ మంజూరైనా నిధులు కేటాయించకపోవడంతో పను లు ప్రారంభంకాలేదు. కొండమల్లేపల్లి ఎస్సీ బాలికల గురుకుల పాఠశాలలో సైతం కోతులు, కుక్కల బెడద అధికంగా ఉండడంతో విద్యార్థినులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ప్రహరీ నిర్మించి రక్షణ కల్పించాలని విద్యార్థులతో పాటు విద్యార్థి సంఘాల నాయకులు డిమాండ్ చేస్తున్నారు.

పాములు, తేళ్లు వస్తున్నాయి

కొమ్మెపల్లి గిరిజన గురుకుల పాఠశాల ప్రహరిగోడలేకపోవడంతో పాములు, తేళ్లు వస్తున్నాయి. రాత్రివేళలో బయటకు వెళ్లాలంటేనే భయపడే పరిస్థితి. ప్రహరిగోడ నిర్మించి సమస్యను పరిష్కరించాలి.

జయరాం, ఇంటర్ విద్యార్థి కొమ్మెపల్లి గిరిజన ఆశ్రమ పాఠశాల.

తనిఖీచేసి సమస్యలు పరిష్కరిస్తాం

దేవరకొండ డివిజన్‌లోని డిండి, కొండభీమనపల్లి గురుకుల పాఠశాలల్లో ఎలుకలు విద్యార్థులను దాడి చేసిన సంఘటన పునరావృతం కాకుండా చర్యలు చేపడుతాం. విషయాన్ని కలెక్టర్‌తోపాటు ఉన్నత అధికారుల దృష్టికి తీసుకెళ్లి రక్షణ చర్యలు చేపడుతాం.

● శ్రీరాములు, దేవరకొండ ఆర్డీవో

హామీ మరిచిన అధికారులు

వేములపల్లి, ఆగస్టు 29: ఉన్నతాధికారులు లిఖితపూర్వకంగా ఇచ్చిన హామీ 15రోజులు అవుతున్నా సమస్యలను పరిష్కరించలేదని వేములపల్లి ఆదర్శ పాఠశాల హాస్టల్ విద్యార్థినులు గురువారం తరగతులను బహిష్కరించి ఆందోళన చేశారు. మధ్యాహ్న భోజనాన్ని సైతం చేయకుండా నిరసన వ్యక్తం చేశారు. పాఠశాల ముగిసిన తర్వాత కూడా ప్రధాన ద్వారం వద్ద కూర్చొని ఉపాధ్యాయులను బయటకు వెళ్లకుండా అడ్డుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జీసీడీవో సరిత, ఎంఈవో బాలాజీనాయక్‌లు తమ హాస్టల్ ప్రాంగణం నుంచి కస్తూర్బా విద్యార్థినిలను ఆగస్టు 15 తర్వాత మరో చోటుకు తరలిస్తామని అప్పటి వరకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా సమస్యను పరిష్కరిస్తామని లిఖిత పూర్వకంగా హామి ఇచ్చి తమ పట్ల నిర్లక్ష్య ధోరణి ప్రదర్శించడంతోనే మరోమారు ఆందోళన చేయాల్సి వచ్చిందన్నారు. అయినప్పటికీ జీసీడీవో, ఎంఈవోలు తమ ఆందోళన పట్ల అంటిముట్టనట్లుగా వ్యవహరించడంతో ఏం చేయాలో దిక్కుతోచని పరిస్థితుల్లో ఉన్నామన్నారు. సుమారు నెల రోజులుగా చాలిచాలని గదుల్లో తీవ్ర ఇబ్బందుల మధ్య చదువులను కొనసాగించాల్సి వస్తుందని, సరైన వసతులు లేక డైనింగ్ హాల్‌లో తిని డైనింగ్ హాల్‌లోనే పడుకోవాల్సిన పరిస్థితి నెలకొందన్నారు.



ఆందోళన చేస్తున్న విద్యార్థినులు

సీపీఎస్ విధానం రద్దుకు కృషి : మంత్రి


వినతిపత్రం అందజేస్తున్న సీపీఎస్ ఉద్యోగులు

నల్లగొండ టౌన్, ఆగస్టు 29: సీపీఎస్ విధానం రద్దుకు తనవంతుగా కృషి చేస్తానని మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి అన్నారు. గురువారం జిల్లా కేంద్రంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో సీపీఎస్ విధానం రద్దు చేయాలని కోరుతూ సీపీఎస్ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు శిరందాసు రామదాసు, టీఎస్‌సీపీఎస్‌యూ రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు పున్న సోమనాథ్ ఆధ్వర్యంలో వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ సీపీఎస్ రద్దు అంశంపై ప్రభుత్వం సానుకూలంగా ఉందని, ఉద్యోగ, ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తుందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత దశాబ్దకాలంగా పెండింగ్‌లో ఉన్న పదోన్నతులు, బదిలీలు, పండిట్ పీఈటీ ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కారించామని, సీపీఎస్ విధానం రద్దునకు కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర సంయుక్త కార్యదర్శి నాగవెల్లి ఉపేందర్, జిల్లా నాయకులు ప్రవీణ్, యాదగిరి, చల్లా సైదయ్య, శ్రీను, రవికుమార్, అశోక్, కృష్ణ, చక్రపాణి, శ్రీనివాస్, వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

మునిసిపల్ కార్మికుల సమస్యల పరిష్కారానికి కృషి


వినతిపత్రం అందజేస్తున్న కార్మికులు

హాలియా, ఆగస్టు 29: మునిసిపల్ కార్మికుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని ఎమ్మెల్యే కుందూరు జైవీర్‌రెడ్డి అన్నారు. హాలియా మునిసిపాలిటీ కార్మికులు గురువారం తమ సమస్యలను పరిష్కరించాలని ఎమ్మెల్యే జైవీర్‌రెడ్డికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తమ సమస్యల ను పరిష్కరించాలని, తమ జీతాల నుంచి కట్ చేసిన పీఎఫ్ డబ్బులు కూడా తమ ఖాతాలో జమ చేయడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఎమ్మెల్యే జైవీర్‌రెడ్డి మాట్లాడుతూ త్వరితగతిన సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని కార్మికులకు హామీ ఇచ్చారు. కార్యక్రమంలో మునిసిపల్ కార్మికులు జానీబాబా, పరశురాం, గిరిబాబు, శంకర్, రమణ, యాదయ్య, రేణుక, కావ్య తదితరులు పాల్గొన్నారు.

హాస్టళ్లలో సమస్యలు పరిష్కరించాలి : ఎస్ఎఫ్ఐ

చండూరు, ఆగస్టు 29: సంక్షేమ హాస్టళ్లలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి ఖమ్మంపాటి శేఖర్ డిమాండ్ చేశారు. చండూరులో గురువారం ఆ సంఘం ఆధ్వర్యంలో కరపత్రాలను ఆవిష్కరించి మాట్లాడారు. విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ సెప్టెంబరు 2వ తేదీన చండూరులో ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో ద్విచక్ర వాహన పోరుయాత్రను ప్రారంభించనున్నట్లు తెలిపారు. పెరుగుతున్న ధరలకు అనుగుణంగా మెస్, కాస్మోటిక్ చార్జీలను పెంచాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ డివిజన్ నాయకులు సన్ని, నవదీప్, అభిలాష్, సుధాకర్, కార్తీక్, వేణు, పవన్, మణి తదితరులు పాల్గొన్నారు.

అంబేడ్కర్ ఆశయ సాధనకు కృషి చేయాలి

దేవరకొండ, ఆగస్టు 29: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ప్రజాసంఘాల జేఏసీ జిల్లా అధ్యక్షుడు కంబాలపల్లి వెంకటయ్య అన్నారు. దేవరకొండలో ఎమ్మార్పీఎస్, ప్రజాసంఘాల జేఏసీ ఆధ్వర్యంలో గురువారం అంబేడ్కర్ తొలి న్యాయశాఖమంత్రిగా ప్రమాణస్వీకారం చేసిన రోజును పురస్కరించుకొని అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించి మాట్లాడారు. అంబేడ్కర్ పేద, బడుగు, బలహీనవర్గాల అభ్యున్నతే లక్ష్యంగా పనిచేశారని, ఆయన ఆశయ సాధనకు కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో ప్రజాసంఘాల జేఏసీ నాయకులు చొల్లేటి భాస్కరచారి, పోతం సహదేవుడు, వెంకటచారి, రవీంద్రనాయక్, యాదగిరి పాల్గొన్నారు.

విద్యార్థులపై నిర్లక్ష్యం వీడాలి : సీపీఎం

వేములపల్లి, ఆగస్టు 29: కస్తూర్బా, ఆదర్శ పాఠశాల హాస్టల్ విద్యార్థినుల పట్ల అధికారులు నిర్లక్ష్య ధోరణి వీడి త్వరితగతిన వారి సమస్యలను పరిష్కరించాలని సీపీఎం నాయకులు పాదూరి శశిధర్‌రెడ్డి, రొండి శ్రీనివాస్ అన్నారు. మండల కేంద్రంలో గురువారం విలేకరులతో మాట్లాడారు. ఆదర్శ పాఠశాల హాస్టల్ ప్రాంగణాలకు కస్తూర్బా విద్యార్థినులను తరలించిన దాఖలాలు రాష్ట్రంలో ఎక్కడా లేవని, వారికి వేర్వేరు హాస్టళ్లు ఏర్పాటు చేయాలని అన్నారు.

మండల వ్యాప్తంగా వనవాసం

పెద్దఅడిశర్లపల్లి, ఆగస్టు 29: ఉమ్మడి మండలవ్యాప్తంగా ఆర్యవైశ్య ఆధ్వర్యంలో గురువారం వనవాస కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. అందరూ స్వచ్ఛందంగా షాపులు మూసివేసి సమీపంలో అక్కంపల్లి రిజర్వాయర్ పార్క్‌లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఆర్యవైశ్య జిల్లా అధ్యక్షుడు వనం వెంకటేశ్వర్లు, ప్రధాన కార్యదర్శి లైశెట్టి శ్రీనివాస్, దేవరకొండ మునిసిపల్ చైర్మన్ ఆలంపల్లి నర్సింహ హాజరయ్యారు. అనంతరం సహపంక్తి భోజనాలు చేసి ఆటపాటలతో సరదాగా గడిపారు. కార్యక్రమంలో సంఘం జిల్లా మాజీ అధ్యక్షుడు పానుగంటి మల్లయ్య, ఉమ్మడి మండల ఆర్యవైశ్య అధ్యక్షుడు విడియాల రామయ్య, వాస వెంకటేశ్వర్లు, సముద్రాల శేఖర్, వీరమల్ల పరమేష, విడియాల బుచ్చమయ్య, లక్ష్మయ్య, జగన్, మంచాల బాబు, శ్రీను, కోటి, శ్రీనివాస్, సతీష్‌కుమార్, గున్నయ్య, శ్రీనయ్య పాల్గొన్నారు.

దేశాభివృద్ధిలో భాగస్వాములు కావాలి

కేతేపల్లి, ఆగస్టు 29: దేశాన్ని అభివృద్ధి పథంలోకి తీసుకెళ్లడంతో పాటు భాగస్వాములు కావాలని నాలుగు పర్యాయాలు గిన్నిస్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్ అవార్డు గ్రహీత డాక్టర్ పెండెం కృష్ణకుమార్ అన్నారు. మండలంలోని చెరుకుపల్లి గ్రామంలోని జడ్పీ హైస్కూల్‌లోని విద్యార్థులకు గురువారం ఆయన క్రీడా సామగ్రి, శాస్త్రవేత్తల చిత్రపటాలు, క్లాత్ బ్యాగులను అందజేసి మాట్లాడారు. నేటి విద్యార్థులే భవిష్యత్తులో దేశ దశ, దిశ మార్చేవారని పేర్కొన్నారు. కార్యక్రమంలో హెచ్ఎం రాజేంద్రప్రసాద్, ఉపాధ్యాయులు మధు, రమేష్, వెంకటరెడ్డి, వెంకట్‌మోహన్, సరిత, కవిరాజు, రేవతి, రోమన్. శంకరయ్య పాల్గొన్నారు.

రేపటి నుంచి జిల్లా స్థాయి శిక్షణ తరగతులు

నల్లగొండ రూరల్, ఆగస్టు 29: హాలియా పట్టణ కేంద్రంలో ఈ నెల ఆగస్టు 31, సెప్టెంబరు 1న సీఐటీయూ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో రాజకీయ శిక్షణ తరగతులను నిర్వహించనున్నట్లు సీఐటీయూ జిల్లా కార్యదర్శి తుమ్మల వీరారెడ్డి తెలిపారు. పట్టణంలోని స్థానిక దొడ్డి కొమరయ్య భవనంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కార్మిక వ్యతిరేక విధానాలను అవలంబిస్తున్నాయని అన్నారు. వారి విధానాలపై సమరశీలంగా పోరాడేందుకు యూనియన్లను బలోపేతం చేసుకోవడానికి ఈ తరగతులు ఉపయోగపడుతాయని అన్నారు. రెండు రోజుల పాటు నిర్వహించే క్లాసులకు సీఐటీయూ రాష్ట్ర నాయకులు హాజరుకానున్నట్లు ఆయన తెలిపారు.

ఇంటింటికి రుణమాఫీ నిర్ధారణ సర్వే

మాడ్గులపల్లి, ఆగస్టు 25: రేషన్‌కార్డు లేక పంట రుణమాఫీ కాని రైతులను వ్యవసాయాధికారులు మాడ్గులపల్లి మండలంలోని కన్నెకల్ గ్రామంలో కుటుంబసభ్యుల నిర్ధారణ సదస్సును గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా మిర్యాలగూడ వ్యవసాయశాఖ సహాయ సంచాలకుడు దేవ్‌సింగ్ పాల్గొని మాట్లాడారు. కుటుంబసభ్యుల నిర్ధారణ కోసం ప్రభుత్వం రైతుల రుణమాఫీ యాప్ ద్వారా వివరాలు సేకరిస్తున్నామని గ్రామాల్లోని రుణమాఫీ కాని రైతులు వ్యవసాయాధికారులను సంప్రదించి వివరాలను అందజేయాలని అన్నారు. రైతులు ఎవరూ అధైర్యపడాల్సిన అవసరం లేదని అన్నారు. కార్యక్రమంలో ఏవో శివరామ్‌కుమార్, ఏఈవోలు వేణుగోపాల్ తదితరులు పాల్గొన్నారు.

నాణ్యమైన ఆహారాన్ని అందించాలి

మిర్యాలగూడ టౌన్, ఆగస్టు 29: వినియోగదారులకు నాణ్యమైన ఆహార పదార్థాలను అందించాలని ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి అన్నారు. పట్టణంలోని ఓ బేకరీ నిర్వాహకులు పాడైపోయిన కేక్‌ను విక్రయించగా వినియోగదారుడు ఆ కేక్‌ను బేకరీలో రిటర్న్ ఇస్తూ వీడియో తీసి సోషల్ మీడియాలో పోస్ట్ చేశాడు. దీంతో నెటిజన్ల నుంచి తీవ్రమైన కామెంట్లు వెల్లువెత్తాయి. ఈ నేపథ్యంలో ఎమ్మెల్యే బేకరీని సందర్శించి ఆహార పదార్థాలను పరిశీలించాడు.

సుస్థిర పాలన అందిస్తున్న బీజేపీ

మిర్యాలగూడ టౌన్, ఆగస్టు 29: ప్రపంచంలోనే అతిపెద్ద పార్టీ బీజేపీ అని ఆ పార్టీ రాష్ట్రకార్యవర్గ సభ్యుడు సాధినేని శ్రీనివాసరావు అన్నారు. సభ్యత్వ నమోదు కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. సుస్థిర పాలన అందిస్తూ దేశాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తున్న బీజేపీలో చేరేందుకు యువత ఉత్సాహం చూపడం హర్షనీయమన్నారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు సభ్యత్వాల నమోదులో ఉత్సాహంగా పాల్గొనాలని పిలుపునిచ్చారు. సమావేశంలో తుమ్మతపల్లి హన్మంతరెడ్డి, కనపర్తి సత్యప్రసాద్, బంటు సైదులు, కొండేటి సరిత, పురుషోత్తంరెడ్డి, రవి, శేఖర్, పోరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బోనమెత్తిన పల్లెలు


కనగల్ గ్రామంలో బోనాలతో మహిళలు

కనగల్, నార్కట్‌పల్లి, చండూరు, డిండి, కొండమల్లేపల్లి, చిట్యాలరూరల్, మునుగోడు, చింతపల్లి, ఆగస్టు 29: శ్రావణమాసం సందర్భంగా గురువారం జిల్లాలోని పలు గ్రామాల్లో బోనాల పండుగను వైభవంగా ని ర్వహించారు. గ్రామ దేవతలకు ప్రత్యేక పూజలు నిర్వహించి భక్తిశ్రద్ధలతో నైవేద్యాలను సమర్పించారు. వర్షాలు సమృద్ధిగా కురిసి పంటలు పండి కరువును తొలగించాలని, అంటువ్యాధుల నుంచి కాపాడాలని వేడుకున్నా రు. అంతకుముందు మహిళలు కొత్తకుండంలో బోనం వండి నెత్తిన ఎత్తుకుని గ్రామశివారులో గల దేవతామూర్తుల దేవాలయాలకు డప్పుచప్పుళ్ల తో ఊరేగింపుగా చేరుకున్నారు. అనంతరం గ్రామ దేవతలకు బోన నైవేద్యాలను సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు.

● కనగల్ మండలంలోని దోరెపల్లి, తేలకంటిగూడెం, తిమ్మన్నగూడెం, కనగల్, లింగాలగూడెం, పగిడిమర్రి గ్రామాల్లో బోనాల పండుగను గ్రామస్థులు ఘనంగా నిర్వహించారు.

● నార్కట్‌పల్లి మండలంలోని అవురవాణి, గోపలాయపల్లి గ్రామాల్లో ముత్యాలమ్మ బోనాల పండుగను ఆయా గ్రామాల ప్రజలు వైభవంగా నిర్వహించారు. కార్యక్రమంలో ఎస్ఆర్ వెంకటేశ్వర్లు, మాదగోని నర్సింహ, కల్లూరి కంఠం, పరమేష్, గోవర్ధన్, సారయ్య, లచ్చయ్య పాల్గొన్నారు.

● చండూరు పట్టణ శివారులో ఉన్న ముత్యాలమ్మ దేవాలయం, బొడ్రాయి వద్ద బోన నైవేద్యాలను సమర్పించారు. కార్యక్రమంలో మునిసిపల్ చైర్మన్ తోకల చంద్రకళవెంకన్న, వైస్ చైర్మన్ దోటి సుజాతవెంకటేష్‌యాదవ్, కోడి శ్రీనివాస్, మహిళలు తదితరులు పాల్గొన్నారు.

● డిండి మండల కేంద్రంలో పోచమ్మ బోనాల ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో పోలం లక్ష్మణ్, మేకల కాశయ్య, శ్రీనివాస్‌గౌడ్, బుషిపాక వెంకటయ్య, దినేష్, రాధిక, కృష్ణ, వెంకటేష్ పాల్గొన్నారు.

● కొండమల్లేపల్లి మండలకేంద్రంలోని దేవరకొండ రోడ్డులోని రేణుకా ఎల్లమ్మ ఆలయం, దుర్గానగర్‌కాలనీ ఆంజనేయస్వామి ఆలయం నుంచి మహిళలు బోనాలతో ఊరేగింపు నిర్వహించారు. పాత ఊరిలోని గల బొడ్రాయి వద్దకు చేరుకొని పూజలు చేసి మొక్కులు చెల్లించారు. కార్యక్రమంలో కుంభం శ్రీనివాస్‌గౌడ్, యాదయ్య, లింగం, శివ పాల్గొన్నారు.

● చిట్యాల మండలంలోని మండలంలోని ఏపూర్ గ్రామంలో ఈదమ్మ దేవత మాందాత ఊరేగింపును నిర్వహించారు. దేవతామూర్తులను ఆలయంలో ప్రతిష్ఠించి ప్రత్యేక పూజలను నిర్వహించారు.

● మునుగోడు మేజర్ గ్రామపంచాతీ పరిధిలో ముత్యాలమ్మ దేవతకు ఊరబోనాలు వైభవంగా నిర్వహించారు.

● చింతపల్లి మండలంలోని గొల్లపల్లిలో పెద్దమ్మతల్లి బోనాల పండుగను నిర్వహించారు. కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీ కంకణాల ప్రవీణ వెంకట్‌రెడ్డి, నాయకులు ప్రేమలత, పరమేష్, శ్రీను, వినోద పాల్గొన్నారు.


చింతపల్లి : బోనాలతో వెళ్తున్న మహిళలు


కొండమల్లేపల్లి: బోనాల వేడుకల్లో పాల్గొన్న భక్తులు


డిండిలో బోనాలు సమర్పిస్తున్న మహిళలు


మునుగోడులో బోనాలతో వెళ్తున్న మహిళలు

గురుకుల విద్యార్థులకు పట్టించుకోని ప్రభుత్వం

● బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు రవీంద్రకుమార్


విద్యార్థులతో మాట్లాడుతున్న రవీంద్రకుమార్

దేవరకొండ, ఆగస్టు 29: దేవరకొండ డివిజన్‌లోని గురుకుల పాఠశాలల్లో విద్యార్థులకు రక్షణ లేకుండా పోయిందని, ఎలుకలు కరిచి అస్వస్థతకు గురవుతున్నా ప్రభుత్వం పట్టించుకోవడంలేదని బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే రమావత్ రవీంద్రకుమార్ అన్నారు. మండలంలోని కొండభీమనపల్లి బీసీ గురుకుల పాఠశాలను గురువారం ఆయన సందర్శించి విద్యార్థులతో మాట్లాడారు. డిండి మండలంలోని ఎస్సీ బాలికల గురుకుల పాఠశాలలో గత నెలలో 16 మంది విద్యార్థినులపై, ఈ నెల 26న కొండభీమనపల్లి బీసీ గురుకుల పాఠశాలలో 13 మంది విద్యార్థులపై ఎలుకలు దాడి చేసి గాయపరిచినా ప్రభుత్వం పట్టించుకోవడం లేదని ఆరోపించారు. విద్యార్థుల జీవితాలతో ప్రభుత్వం చెలగాటం ఆడుతుందని విమర్శించారు. గురుకులాల్లో విద్య, భోజనం, వసతులు కల్పించాలని ఆయన డిమాండ్ చేశారు. ప్రహరీగోడలు నిర్మించి ఎలుకలు, క్రిమికీటకాలు రాకుండా చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. ఆయన వెంట బీఆర్ఎస్ నాయకులు వెంకట్‌రెడ్డి, వేముల రాజు, కృష్ణ ఉన్నారు.

విద్యార్థి సంఘాల ఆందోళన

గురుకుల పాఠశాలలో విద్యార్థులకు ఎలుకలు కరవడంతో పాటు విద్యార్థులు అస్వస్థతకు గురైనా ప్రభుత్వం పట్టించుకోవడం లేదని ఏబీవీపీ, బీఆర్ఎస్వీ విద్యార్థి సంఘాల నాయకులు విమర్శించారు. కొండభీమనపల్లి బీసీ గురుకుల పాఠశాల ఎదుట ఏబీవీపీ, బీఆర్ఎస్వీ ఆధ్వర్యంలో గురువారం వేర్వేరుగా ఆందోళన కార్యక్రమాలు చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గురుకుల పాఠశాలల్లోకి ఎలుకలు, క్రిమికీటకాలు ప్రవేశించి విద్యార్థులను గాయపరుచుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఉన్నతాధికారులు స్పందించి సంబంధిత అధికారులపై చర్యలు తీసుకొని క్రిమికీటకాలు, ఎలుకలు గురుకులాల్లోకి ప్రవేశకుండా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఏబీవీపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు యలమల గోపిచంద్, బీఆర్ఎస్వీ నియోజకవర్గ అధ్యక్షుడు బొడ్డుపల్లి కృష్ణ, లక్ష్మణ్, పరమేష్, హరికృష్ణ, వెంకట్, అనిల్ పాల్గొన్నారు.

డిండి పథకానికి డీపీఆర్ ఆమోదించాలి

గట్టుప్పల్, ఆగస్టు 29: డిండి ఎత్తిపోతల పథకం డీపీఆర్‌ను ఆమోదించి, తగిన నిధులు కేటాయించాలని సీపీఎం నాయకులు డిమాండ్ చేశారు. మండల కేంద్రంలో సంతకాల సేకరణ కార్యక్రమాన్ని గురువారం సీపీఎం నాయకులు చేపట్టారు. ఈ సందర్భంగా సీపీఎం మండల నాయకుడు కర్నాటి సుధాకర్ మాట్లాడుతూ పర్యావరణ అనుమతులు ఇచ్చి మునుగోడు నియోజకవర్గంలో ఉన్న వంటి చర్లగూడ, శివన్నగూడ ప్రాజెక్టులు పూర్తి చేసి ఈ ప్రాంత రైతులకు సాగునీరు అందించాలని కోరారు. సెప్టెంబరు 2వ తేదీన కలెక్టర్‌కు సంతకాలతో కూడిన మెమోరాండం అందజేయనున్నట్లు తెలిపారు. సంతకాల కార్యక్రమంలో సీపీఎం టౌన్ కార్యదర్శి ఖమ్మం రాములు, సీపీఎం నాయకులు, రైతు సంఘం నాయకులు కర్నాటి వెంకటేశం, కిన్నెర భిక్షమయ్య, పెదగాని నరసింహ, కర్నాటి యాదయ్య, చెన్నయ్య, వెంకటేశం, నరసింహ, రాములు, మారయ్య తదితరులు పాల్గొన్నారు.

హరికృష్ణ సేవలు ఆదర్శనీయం


హరికృష్ణ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న నాయకులు

మిర్యాలగూడ టౌన్, ఆగస్టు 29: తెలుగు ప్రజల ఆత్మగౌరవాన్ని పెంచిన టీడీపీలో కీలకపాత్ర పోషించిన హరికృష్ణ సేవలు ఆదర్శనీయమని పట్టణ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు వడ్డెబోయిన శ్రీనివాస్, నుసుం నగేష్ అన్నారు. టీడీపీ, అనుబంధ సంఘాల ఆధ్వర్యంలో నందమూరి హరికృష్ణ వర్ధంతి నిర్వహించారు. ఈ సందర్భంగా హరికృష్ణ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో మచ్చ సైదులు, పోగుల సైదులుగౌడ్, అనంతరాములు, గోపాలకృష్ణ, కాంతాచారి, వెంకటేశ్వర్లు, నాగేందర్, శంకర్, నర్సింహగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

సంగం డెయిరీలో ట్రయల్ రన్

మిర్యాలగూడ రూరల్, ఆగస్టు 29: మిర్యాలగూడ మండలం శ్రీనివాస్‌నగర్ గ్రామంలో లక్షన్నర లీటర్ల కెపాసిటీతో అత్యాధునికమైన యంత్ర సామగ్రితో సంగం డెయిరీని ఏర్పాటు చేశారు. ట్రయల్ రన్‌ను బుధవారం చైర్మన్ ధూళిపాల్ల నరేంద్రకుమార్ ప్రారంభించారు. ఈ డెయిరీ నుంచి నల్లగొండ, ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం, హైదరాబాద్, మహబూబ్‌నగర్ తదితర జిల్లాలకు ఉత్పత్తులు చేరవేయనున్నట్లు ఆయన తెలిపారు. అలాగే ప్లాంట్‌కు అనుబంధంగా రాష్ట్రంలోని ఆయా ప్రాంతాల్లో ఆరు చిల్లింగ్ సెంటర్లను త్వరలో ఏర్పాటు చేయబోతున్నట్లు నరేంద్రకుమార్ తెలిపారు. భవిష్యత్తులో 3 లక్షల లీటర్ల కెపాసిటీకి విస్తరించే విధంగా మౌలిక సదుపాయాలకు సన్నాహాలు చేస్తున్నట్లు ఆయన తెలిపారు.

పారిశుధ్య లోపంపై జోనల్ అధికారి ఆగ్రహం

నార్కట్‌పల్లి, ఆగస్టు 29: నార్కట్‌పల్లి మండలంలోని చిన్ననారాయణపురం శివారులో గల సాంఘీక సంక్షేమ గురుకుల పాఠశాలలో పారిశుధ్య నిర్వహణపై జోనల్ అధికారి విద్యావాణి సదరు కాంట్రాక్టర్‌పై ఆగ్రహం వ్యక్తం చేశారు. గురుకుల పాఠశాలను ఆమె గురువారం ఆకస్మిక తనిఖీ చేశారు. పాఠశాలలో ఉన్న టాయ్‌లెట్ల నిర్వహణ అధ్వానంగా ఉండటంపై ఆమె తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. రాష్ట్రంలో ఓ వైపు వివిధ గురుకులాల్లో పారిశుధ్యం లోపించి విద్యార్థులు అస్వస్థతతో ఆసుపత్రుల పాలవుతున్నా పారిశుధ్యం నిర్వహించే విధానం ఇలాగేనా అంటూ ఆమె ఆగ్రహం వ్యక్తం చేశారు. 600 మంది విద్యార్థులకు భవనం సరిపోదని గుర్తించారు. త్వరలోనే ఉన్నతాధికారులతో మాట్లాడి కొత్త భవనంలోకి మార్చేందుకు కృషి చేస్తానని అన్నారు. అనంతరం రికార్డులను పరిశీలించారు. కాలేజీ ప్రిన్సిపల్ శమంతకమణి, వైస్ ప్రిన్సిపల్ సజియా, కృష్ణవేణి, పేరెంట్స్ కమిటీ చైర్మన్ కోక చంద్రశేఖర్, ప్రధాన కార్యదర్శి కొమ్ము యాదగిరి పాల్గొన్నారు.

ధ్యాన్‌చంద్ హాకీ మాంత్రికుడు

● హౌసింగ్ కార్పొరేషన్ పీడీ రాజ్‌కుమార్

నల్లగొండ స్పోర్ట్స్, దేవరకొండ, హాలియా, ఆగస్టు 29: ధ్యాన్‌చంద్ భారత హాకీ మాంత్రికుడని, ఆయన్ను ఆదర్శంగా తీసుకొని క్రీడా రంగంలో రాణించాలని హౌజింగ్ కార్పొరేషన్ పీడీ రాజ్‌కుమార్ అన్నారు. జిల్లా కేంద్రంలోని ఇండోర్ స్టేడియంలో గురువారం ధ్యాన్‌చంద్ జయంతిని పురస్కరించుకొని క్రీడల శాఖ ఆధ్వర్యంలో జాతీయ క్రీడా దినోత్సవాన్ని నిర్వహించారు. ధ్యాన్‌చంద్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అంతర్జాతీయంగా హాకీ క్రీడకు ఘనతను తీసుకువచ్చిన మాంత్రికుడు ధ్యాన్‌చంద్ అని, ఆయన జయంతిని జాతీయ క్రీడా దినోత్సవాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అనంతరం జిల్లా స్థాయి క్రీడా పోటీలను నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో పీఆర్ఎస్ఈ తిరుపతయ్య, విశ్రాంతి ఐఏఎస్ చొల్లేటి ప్రభాకర్, టీఎన్జీవోస్ జిల్లా అధ్యక్షుడు మురళి, గెజిటెడ్ ఆఫీసర్ల సంఘం అధ్యక్షుడు ముజుబుద్దీన్, చెస్ అసోసియేషన్ సెక్రటరీ కరుణాకర్ రెడ్డి, బ్యాడ్మింటన్ అసోసియేషన్ కార్యదర్శి పంతులు శ్రీనివాసులు, డీఎస్‌డీవో మక్బుల్ అహ్మద్, కిరణ్‌కుమార్, నజీర్ పాల్గొన్నారు.

● నల్లగొండ ఫుట్‌బాల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో పట్టణంలోని గడియారం సెంటర్ నుంచి ఎన్జీ కళాశాల వరకు క్రీడా ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో అసోసియేషన్ అధ్యక్షుడు బండారు ప్రసాద్, డాక్టర్ పుల్లారావు, డాక్టర్ ఓరుగంటి శ్రీనివాస్, గుర్రం వెంకన్న, కోచ్ దాసు, సునీత పాల్గొన్నారు. అనంతరం ఫుట్‌బాల్ పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు.

● దేవరకొండ స్పోర్ట్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ధ్యాన్‌చంద్ జయంతిని నిర్వహించారు. ధ్యాన్‌చంద్ విగ్రహానికి స్పోర్ట్స్ అసోసియేషన్ అధ్యక్షుడు ఎన్‌వీటీ పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో కార్యక్రమంలో మునిసిపల్ చైర్మన్ ఆలంపల్లి నర్సింహ, స్పోర్ట్స్ అసోసియేషన్ సభ్యులు కృష్ణకిషోర్, అమర్, వెంకటేశ్వర్లు, భాస్కర్, శ్యాంసన్, శీను, జగన్ తదితరులు పాల్గొన్నారు.

● హాలియా మునిసిపాలిటీలోని టైం పాఠశాలలో జాతీయ క్రీడా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ కత్తి కోటిరెడ్డి, డైరెక్టర్ మందా నరేందర్‌రెడ్డి పాల్గొన్నారు. మండల వ్యాయామ ఉపాధ్యాయుల ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో జడ్పీహెచ్ఎస్ పీడీ వెంకట్ రాంరెడ్డి, వ్యాయామ ఉపాధ్యాయులు చెన్నుపాటి డొనిమిక్, యడవల్లి రాంబాబు, రమేష్ పాల్గొన్నారు. చల్మారెడ్డిగూడెం గ్రామంలోని జడ్పీ హైస్కూల్‌లో నిర్వహించిన కార్యక్రమంలో పీడీ గార్లపాటి శ్యామలాదేవి, ఉపాధ్యాయులు ప్రకాష్, లిల్లీ థెరిస్సా, పల్‌రెడ్డి నిర్మల, రేణుక, వెంకట్‌రెడ్డి, షర్ఫోద్దీన్, జ్యోతి పాల్గొన్నారు.

దేశ భాషలన్నింటి కన్నా తెలుగుభాష గొప్పది


చిత్రపటాలకు నివాళులర్పిస్తున్న అధ్యాపకులు

హాలియా, మిర్యాలగూడ టౌన్, ఆగస్టు 29: దేశ భాషలన్నింటి కన్నా తెలుగు భాష గొప్పదని, ప్రతి మనిషిలోని 56 నాడులు స్పందించడానికి గల కారణం తెలుగు భాష అని హాలియా ప్రభుత్వ జూనియర్ కళాశాల తెలుగు అధ్యాపకులు సంజీవరెడ్డి అన్నారు. గురువారం హాలియా ప్రభుత్వ జూనియర్ కళాశాలలో తెలుగు భాష దినోత్సవాన్ని, జాతీయ క్రీడా దినోత్సవాన్ని ఉమ్మడిగా ఒకే వేదికపై సిలువేరు లింగమూర్తి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రాచీన భాషలన్నింటిలో తెలుగు భాష ఒకటని, క్రీడలు మానసిక ఉల్లాసానికి పెట్టింది పేరు అని, క్రీడల వల్ల మానసిక, శారీరక దృఢత్వం ఏర్పడుతుందన్నారు. కార్యక్రమంలో హరికృష్ణ, శిల్పా, ఆదిరెడ్డి, అధ్యాపకులు పాల్గొన్నారు.

● మిర్యాలగూడ పట్టణంలోని కేఎన్ఎం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో తెలుగు భాషా దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా గిడుగు రామమూర్తి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ భీమార్జున్‌రెడ్డి మాట్లాడుతూ వారసత్వపు విలువలు కొనసాగించాలని అన్నారు. కళాశాల క్రీడావిభాగం ఆధ్వర్యంలో ధ్యాన్ చంద్ జయంతి నిర్వహించారు. కార్యక్రమంలో త్రాసు వెంకటరమణ, నాగరాజు, రవీందర్ పాల్గొన్నారు.

ప్రాజెక్టులను పూర్తిచేసి సాగునీరు అందించడమే లక్ష్యం

● ఎమ్మెల్యే బాలునాయక్


ఎమ్మెల్యే బాలునాయక్

దేవరకొండ, ఆగస్టు 29: శ్రీశైలం సొరంగమార్గం, నక్కలంగండి, డిండి ఎత్తిపోతల ప్రాజెక్టులను పూర్తిచేసి నియోజకవర్గానికి సాగునీరు అందించడమే ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే నేనావత్ బాలునాయక్ అన్నారు. దేవరకొండలో గురువారం ఆయన విలేకరులతో మాట్లాడారు. సీఎం రేవంత్‌రెడ్డి ఎస్ఎల్‌బీసీ, డిండి, నక్కలగండి ప్రాజెక్టులపై ప్రత్యేక దృష్టి సారించినట్లు తెలిపారు. నీటి పారుదలశాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి ప్రాజెక్టుల నిర్మాణమే లక్ష్యంగా పని చేస్తున్నట్లు తెలిపారు. నియోజకవర్గంలో పెండింగ్‌లో ఉన్న ప్రాజెక్టులను రెండున్నరేళ్లలో పూర్తిచేసి ఐదు లక్షల ఎకరాలకు సాగునీరు అందించడమే లక్ష్యంగా ముందుకు వెళుతున్నట్లు తెలిపారు. దీంతో పాటు గుట్టలపై ఉన్న గ్రామాలకు ఐదు ఎత్తిపోతల పథకాల ద్వారా సాగునీరు అందించే పనులు పునఃప్రారంభమైనట్లు ఆయన తె లిపారు. భూనిర్వాసితులకు పూర్తిస్థాయిలో పరిహారం, పునరావా సం కల్పిస్తామన్నారు. నక్కలగండిని పూర్తిచేసి సాగునీరు అందిస్తామన్నారు. ప్రభుత్వం ప్రవేశపెడుతున్న ఆరు గ్యారెంటీలను అమలుచేస్తామని, రైతులకు రూ.2లక్షల రుణమాఫీ చేసిన ఘన త ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికే దక్కిందని పేర్కొన్నారు.

● దేవాలయాల అభివృద్ధికి ప్రభుత్వం కృషి చేస్తుందని ఎమ్మెల్యే బాలునాయక్ అన్నారు. మండలంలోని మంగలోనిబావి పెద్దమ్మతల్లి పండగను పురస్కరించుకొని లింగమంతులస్వామి ఆలయంలో ఆయన ప్రత్యేక పూజలు చేసి మాట్లాడారు. దేవాలయాల అభివృద్ధికి తనవంతుగా కృషి చేస్తానని తెలిపారు.

సంక్షిప్త సమాచారం...

చండూరు: చండూరు మునిసిపాలిటీలో ఇటీవల ఆత్మహత్య చేసుకున్న చేనేత కార్మికుడు పులిపాటి అంజయ్య కుటుంబానికి పద్మశాలీ సంఘం జిల్లా అధ్యక్షుడు పొట్టబత్తిని సత్యనారాయణ రూ.10వేలు ఆర్థిక సహాయాన్ని అందజేశారు.

చింతపల్లి: మండల కేంద్రంలో పెద్దమ్మతల్లి ఉత్సవాలు నేటి నుంచి అక్టోబరు 1వ తేదీ వరకు నిర్వహిస్తున్నట్లు యాదవ కమిటీ సభ్యులు తెలిపారు. ఈబొడ్రాయి వద్దకు చేరుకోని జలాభిషేకం చేశారు.

కొండమల్లేపల్లి: ఆర్యవైశ్యసంఘం మండల అధ్యక్షుడుగా ఊరే జనార్ధన్, ప్రధానకార్యదర్శిగా మిర్యాల శ్రీనివాస్, కోశాధికారిగా ముచ్చర్ల కర్ణాకర్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు సంఘం జిల్లా మహాసభ అధ్యక్షుడు వనం వెంకటేశ్వర్లు తెలిపారు.

చింతపల్లి: విద్యార్థులు ప్రణాళికతో చదివి ప్రతిభ చాటాలని మాజీ ఎంపీపీ కొండూరి పవన్‌కుమార్ అన్నారు. వెంకటేశ్వరనగర్ జడ్పీహెచ్ఎస్‌లో స్వాతంత్ర్య దినోత్సవం నిర్వహించిన పోటీల్లో విజేతలకు ఆయన బహుమతులు అందజేశారు.

చందంపేట: తహసీల్దార్‌కు నేరేడుగొమ్ము ఇన్‌చార్జి అదనపు బాధ్యతలు ఇవ్వడంతో చందంపేట మండల ప్రజలకు అందుబాటులో ఉండకపోవడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. దీనికితోడు తిరుమలగిరి సాగర్ బాధ్యతలు కూడా ఇవ్వడంతో మూడు మండలాల బాధ్యతలను పనిభారంతో సక్రమంగా అందుబాటులో ఉండలేకపోతున్నట్లు తహసీల్దార్ శ్రీనివాస్ తెలిపారు.

వేములపల్లి: పోస్టాఫీసుల ద్వారా ప్రభుత్వం అందజేస్తున్న పలు తపాలా బీమా పథకాలను సద్వినియోగం చేసుకోవాలని మిర్యాలగూడ సబ్ డివిజన్ ఏఎస్పీ రాజ నరసింహగౌడ్ అన్నారు. మండలంలోని శెట్టిపాలెంలో ఇటీవల తపాలా, జీవిత బీమా పథకాన్ని తీసుకొని మృతిచెందిన వారికి 15రోజుల వ్యవధిలోనే రూ.1లక్ష బీమా నగదును అందచేశారు.

మిర్యాలగూడ రూరల్: ప్రతి ఒక్కరూ తమ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని మండల వైద్యాధికారి మోయిద్ అన్నారు. మండలంలోని కేశవనగర్ గ్రామంలో గ్రామస్థులకు వైద్యశిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా జ్వరాలు, కీళ్ల నొప్పులతో బాధపడుతున్న వారికి చికిత్స అందించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. పరిసరాలు పరిశుభ్రంగా లేకపోతే దోమలు వృద్ధి చెంది వ్యాధులు వ్యాపిస్తాయని అన్నారు. కార్యక్రమంలో వైద్యులు శిరీష, హెచ్ఈవో ప్రభాకర్, వాసుదేవరెడ్డి, హెల్త్ అసిస్టెంట్లు, ఏఎన్ఎంలు, ఆశాలు తదితరులు పాల్గొన్నారు.

నార్కట్‌పల్లి: నార్కట్‌పల్లి మండలంలోని చిన్ననారాయణపురం గ్రామ శివారులో ఉన్న సాంఘీక సంక్షేమ గురుకుల పాఠశాలకు ఆసరా స్వచ్ఛంద సంస్థ చైర్మన్ మేడి హరికృష్ణ ట్యూబ్‌లైట్లు, కుర్చీలను అందజేశారు. పాఠశాల విద్యార్థులకు కావాల్సిన పుస్తకాలు, క్రీడా, ఇతర వస్తువులను తన దృష్టికి తెస్తే సమకూర్చేందుకు కృషి చేస్తానన్నారు.

నార్కట్‌పల్లి: తమ గ్రామంలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని మండలంలోని వెంకటాపురం గ్రామానికి చెందిన రైతులు తహసీల్దార్ వెంకటేశ్వర్‌రావుకు వినతిపత్రాన్ని అందజేశారు.

శాలిగౌరారం: మండలంలోని మాదారం గ్రామశివారులో గల శ్రీదేవి భూదేవి సమేత శ్రీ వెంకటేశ్వరస్వామి దేవాలయ ప్రాంగణంలో కల్యాణ మండపం నిర్మాణానికి భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా మాజీ ఎంపీటీసీ నోముల జనార్దన్ మాట్లాడుతూ భక్తుల విరాళాలు 10లక్షలకు పైగా వ్యయంతో కల్యాణ మండపాన్ని నిర్మించనున్నట్లు తెలిపారు.

శాలిగౌరారం: శాలిగౌరారంలోని సీతారామచంద్రస్వామి ఆలయంలో ఘనంగా శ్రీ కృష్ణాష్టమి వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ ప్రాంగణంలో ఉట్లు కొట్టే కార్యక్రమాన్ని వైభవంగా నిర్వహించారు. ఉట్లు కొట్టడానికి పిల్లలు, యువకులు పోటీపడ్డారు.

త్రిపురారం: పార్టీ సభ్యత్వ నమోదు భారీగా ఉండాలని బీజేపీ మండల అధ్యక్షుడు పొనుగోటి హరీష్ అన్నారు. ప్రతి గ్రామ పోలింగ్ బూత్‌లో సుమారు రెండు వందలకు పైగా నూతన సభ్యత్వ నమోదు చేయాలని కార్యకర్తలకు ఆయన సూచించారు. కార్యక్రమంలో సోషల్ మీడియా జిల్లా కన్వీనర్ కటకం మల్లికార్జున్, ధనుంజయ, కృష్ణ, మహేష్ పాల్గొన్నారు.

కేతేపల్లి: మండలంలోని గుడివాడ గ్రామంలో శ్రీకంఠమహేశ్వరస్వామి, సురమాంబల కళ్యాణ వేడుకలు గురువారం నాలుగో రోజూ కొనసాగాయి. గీత కార్మిక కుటుంబాలు జలబిందెలతో ఆలయం వరకు ప్రదర్శనగా వెళ్లి నూతనంగా ఆలయంలో ప్రతిష్ఠించిన కంఠమహేశ్వరుడు, ఎల్లమ్మ తల్లి, వన మైసమ్మ తల్లి విగ్రహాలకు జలాభిషేకం, పంచామృత స్నానాలు చేయించారు. ఆలయం పరిసరాల్లో ఏర్పాటు చేసిన హోమ గుండాల వద్ద హోమాలు నిర్వహించారు.

కేతేపల్లి: అమ్మలాంటి కమ్మనైన మాతృభాష తెలుగును మరవద్దని భీమారం జడ్పీహెచ్ఎస్ హెచ్ఎం కె.భిక్షమయ్య అన్నారు. పాఠశాలలో రామమూర్తి చిత్రపటానికి నివాళులర్పించి ఆయన మాట్లాడారు. తెలుగు భాష ఔన్నత్యాన్ని నేటి తరానికి చాటి చెప్పాలన్నారు.

తిప్పర్తి: విద్యుత్ ప్రమాదానికి గురై మృతి చెందిన రైతు చిలక శ్రీనివాస్‌రెడ్డి కుటుంబాన్ని మంత్రి వెంకట్‌రెడ్డి పరామర్శించారు. మంత్రి మాట్లాడుతూ రైతులకు ఆదర్శంగా ఉంటూ పార్టీ అభివృద్ధికి శ్రీనివాస్‌రెడ్డి చేసిన సేవలు మర్చిపోలేనివని అన్నారు. ఆయన కుటుంబానికి అన్ని విధాలా అండగా ఉంటానని అన్నారు. 40, 39 కాల్వలకు నీరు వదలాలని గ్రామానికి చెందిన నలపరాజు శ్రీను కోరారు. ఈ మేరకు మంత్రి మాట్లాడుతూ తిప్పర్తి మండలానికి నీరు వస్తుందని తెలిపారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ జూకూరి రమేష్, నాయకులు రవీందర్‌రెడ్డి, లింగారావు, డీసీసీబీ డైరెక్టర్ సంపత్‌రెడ్డి, శ్యాంసుందర్ పాల్గొన్నారు.

చిట్యాలరూరల్: చిట్యాల మండలం వట్టిమర్తి శివారులో బస్‌స్టేజి సమీపంలో గల శ్రీషిరిడీ సాయిబాబా ఆలయ వార్షికోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. చందనోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. మధ్యాహ్న హారతి అనంతరం ఊరేగింపు నిర్వహించారు.

మునుగోడు: మునుగోడులోని మహాత్మా జ్యోతిబాపూలే బాలికల గురుకుల పాఠశాలలో నెలకొన్న నీటి సమస్యను పరిష్కరించేందుకు కస్తూరి ఫౌండేషన్ వ్యవస్థాపకుడు కస్తూరి శ్రీచరణ్ స్వచ్ఛందంగా ముందుకు వచ్చారు. ఆఫౌండేషన్ ఆధ్వర్యంలో నూతనంగా ఏర్పాటు చేశారు. ఈసందర్భంగా మోటారు బిగింపు పనులను పూర్తి చేశారు.